తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



డ్రగ్స్‌కు దూరంగా ఉండండి..

(హైదరాబాద్, సాక్షర): మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతలో అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు చేపడుతున్న సైక్లింగ్ యాత్ర అభినందనీయమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ...

3వ పేజీ



బ్రహ్మోత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 19 నుంచి 24 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ...

4వ పేజీ

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 282 ఆదివారం, నవంబర్ 15, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00

చైనాలో అగ్రరాజ్యాల అరుదైన భేటీ..



(బీజింగ్, సాక్షర): ప్రపంచ రాజకీయాల్లో ఒక అరుదైన, అత్యంత కీలకమైన ఘట్టానికి రంగం సిద్ధమైంది. ప్రపంచంలోని మూడు అతిపెద్ద అణుశక్తి దేశాలైన అమెరికా, రష్యా, చైనా అధినేతలు ఒకే వేదికపై సమావేశం కానున్నారు. వచ్చే వారం చైనాలోని టెక్ హబ్ షెన్‌జెన్‌లో జరిగే 'ఆసియా-పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్' (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఈ త్రైపాక్షిక భేటీ జరగనుంది. ఈ మేరకు వైట్ హౌస్ అధికారికంగా ధ్రువీకరించింది. పూర్తిగా 3 లో

అమెరికాలో గంటలపాటు నిలిచిన 11వేల విమానాలు..



(న్యూయార్క్, సాక్షర): అగ్రరాజ్యం అమెరికాలో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్య కారణంగా దాదాపు 11వేల విమానాలు కొన్ని గంటల పాటు ఎయిర్‌పోర్టుల్లోనే నిలిచిపోయాయి. ఏటీసీ కమ్యూనికేషన్ సమస్య కారణంగా విమాన సేవలను నిలిపివేసినట్లు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడిందని.. విమాన సర్వీసులను నెమ్మదిగా పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 4 గంటల (భారత్‌లో శనివారం తెల్లవారుజామున 2.30 గంటల) సమయంలో ఈ అంతరాయం ఏర్పడింది. పూర్తిగా 2 లో

క్యూబాలో ఆకలి కేకలు



కహవానా: రీబియన్ సముద్రంలోని ద్వీప సమూహ దేశం క్యూబాలో అధికారంలో ఉన్న సామ్యవాద వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలుగా దేశ ప్రజలకు ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, రాయితీతో కూడిన ఆహారం, అత్యధికులకు ప్రభుత్వరంగ ఉపాధి అందిస్తూ వచ్చింది. బియ్యం, బీన్స్, పాలపొడి, చికెన్, వంటనూనె, గుడ్లు వంటి ఆహార దిగుమతులపై గతంలో ఏటా 2 బిలియన్ డాలర్లకు (రూ.18,855 కోట్లు) పైగా ఖర్చు చేసేది. దాదాపుగా 99 శాతం అక్షరాస్యత ఉన్న ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఓ మోస్తరుగా ఉన్నా, కనీస అవసరాలకు ఇబ్బంది పడేవారు కాదు. ఇప్పుడు అదంతా గత చరిత్ర. సుమారు కోటీ 10 లక్షల జనాభా గల నేటి క్యూబాను సుదీర్ఘకాలంగా ఆర్థికసంక్షోభం పీడిస్తోంది. పూర్తిగా 4 లో

చాట్ జీపీటీ కొత్త ఫీచర్...



న్యూఢిల్లీ: టెక్నాలజీ దిగ్గజం ఓపెన్‌ఏఐ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మరో సంచలనానికి తెరలేపింది. తమ ఏఐ ఏజెంట్లు యూజర్ల తరపున నేరుగా ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిపేందుకు వీలుగా 'చాట్‌జీపీటీ వాలెట్' అనే కొత్త పేమెంట్ ఫీచర్‌ను నవంబర్ 13న అధికారికంగా ప్రకటించింది. వీసా, మాస్టర్‌కార్డ్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి దిగ్గజ పేమెంట్ నెట్‌వర్క్‌లతో కలిసి ఈ సేవలను అభివృద్ధి చేసింది. ఈ ఫీచర్‌తో యూజర్లు తమ ఏఐ అసిస్టెంట్లకు షాపింగ్ బాధ్యతలు అప్పగించవచ్చు.ఈ వ్యవస్థ పూర్తి భద్రతకు పెద్దపీట వేస్తూ పనిచేస్తుంది. ముందుగా యూజర్లు తమ పేమెంట్ కార్డు వివరాలను ఒకసారి చాట్‌జీపీటీ వాలెట్‌లో యాడ్ చేయాలి. పూర్తిగా 2 లో

మూడు బడ్జెట్లు.. అవే హామీలు.. అమలెక్కడ?..



(హైదరాబాద్, సాక్షర): కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయహస్తం'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ఖజానా ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం అమలవుతున్న పథకాలకు పొంతన లేదని ఆరోపించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ మూడేళ్లలో రూ.5 వేల కోట్ల లోపే కేటాయించారని ఆరోపించారు. మిగతా 3 లో

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..



- ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ:రాహుల్ గాంధీ
- తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన రాహుల్ గాంధీ
- ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడి
- రూ.5 లక్షల ప్రమాద బీమా, పింఛన్, సామాజిక భద్రత కల్పిస్తామని హామీ
- పని, ఆదాయ వివరాలు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంటాయని వెల్లడి
- వైఫైతో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ

గిగ్ వర్కర్ల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా, వారి హక్కులు, సంక్షేమానికి భరోసా కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కంపెనీలకే అనుకూలంగా కేంద్ర విధానాలు: గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇప్పటివరకు అందుబాటులో లేదని, తమ శ్రమకు ఎంత ప్రతిఫలం వస్తోందనే విషయంలోనూ స్పష్టత లేదని రాహుల్ గాంధీ అన్నారు. 3 లో

వాలంటీర్ల వ్యవస్థ దిశగా అడుగులు

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ జకీయాల్లో ఇప్పుడు వాలంటీర్ల వ్యవస్థ ఒక హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, సుమారు లక్ష మంది యువతతో కూడిన క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడం, సంక్షేమ ఫలాలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అందించడం ఈ ప్రతిపాదన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల వంటి పథకాల పంపిణీలో సచివాలయం నుంచి క్షేత్రస్థాయి వరకు ఉన్న అంతరాన్ని పూడ్చాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. 4 లో

కాంగ్రెస్ 'అభయహస్తం' హామీలన్నీ ఏమయ్యాయి?..

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయహస్తం'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ఖజానా ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం అమలవుతున్న పథకాలకు పొంతన లేదని ఆరోపించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 3 లో

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్లో జరుగుతున్న 'యాంటీ-భారత్ సమ్మిట్'కు వ్యతిరేకంగా, అలాగే ఆరు గ్యారంటీలు సహా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేసిన రాహుల్ గాంధీ పర్యటనకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన చేపట్టకుండా అడ్డుకునేందుకు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ను తార్నాకలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రామచంద్రరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అణచివేస్తూ పోలీసులు ఈ విధంగా గృహనిర్బంధం చేయడం పూర్తిగా అన్యాయం, అక్రమం. 4 లో

ఇంటర్ బోర్డు రద్దు సరే... ప్రత్యామ్నాయం సంగతేంటీ



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ విద్యా వ్యవస్థలో 55 ఏళ్లుగా వేళ్లూనుకుపోయిన ఇంటర్మీడియట్ బోర్డు ను రద్దు చేసి, సీబీఎస్ఈ , ఐసీఎస్ఈ బోర్డుల తరహాలో 2027–28 విద్యా సంవత్సరం నుంచి 10+2 విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారింది. 4 లో

తెలంగాణ రాష్ట్రానికి కారణమే కేసీఆర్



(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం నాడు పలువుతు బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. .మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్. మాట్లాడుతూ నవంబర్ నెల అనగానే తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష గుర్తొస్తుంది. దీక్షా దివాస్ తో కేసీఆర్ ఢిల్లీ మెడలు వంచాడు. దీక్షా దివాస్ ను మరోసారి స్ఫూర్తిగా తీసుకుంటున్నాము. మానకొండూరు నియోజకవర్గం అలుగునూరులో ఈ నెల 29 న దీక్షా దివాస్ బహిరంగ సభ జరుపుతున్నాం. దీక్షా దివాస్ బహిరంగ సభకు కేటీఆర్ హాజరు అవుతారు. దీక్షా దివాస్ సభను సక్సెస్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. .మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ నవంబర్ 29 వ రోజు 40 , 50 ఏండ్ల దరిద్రాన్ని వదిలించుకున్న రోజు. చరిత్ర మలుపు తిరిగిన రోజు నవంబర్ 29. ఆరోజు నేను ఎమ్మెల్యేగా ఉన్నాను. ఆమరణ దీక్ష చేస్తున్న కేసిఆర్ ను అరెస్ట్ చేశారు. కేసీఆర్ ఆమరణ దీక్ష చెయ్యకపోతే ఢిల్లీ దిగి వచ్చేది కాదు. పూర్తిగా 3 లో

కేసీఆర్ పెనుముప్పు నుంచి రక్షించారు..



కవితను పార్టీ నుంచి బహిష్కరించినందుకు కేసీఆర్‌కు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. దుర్మార్గమైన దోపిడీ, పెనుముప్పు నుంచి రక్షించారని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి సౌజన్యంతో పాంచజన్యం ఎజెండాతో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేశారు, ఆధారాలు ప్రజల ముందు బయటపెడతానన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికార పక్షం దోపిడీ నిరంతరంగా సాగుతోంది. ఎన్ని కేసులు పెట్టినా, ఇబ్బంది పెట్టినా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అధికార పక్షంపై దోపిడీ చేయాల్సిన కవిత... బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తున్నారు. తండ్రి కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్ రావును విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ కు నాలుగో అనుబంధ సంస్థగా టీఆర్ఎస్, రేవంత్ రక్షణ సేనగా పనిచేస్తోంది. కేటీఆర్, హరీశ్ రావుపై నిత్యం గళమెత్తుతున్న టీఆర్ఎస్... కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థ కాకపోతే మరేమిటి..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. 2012లో ఆడి కోర్ ఇన్ ఫ్రా కంపెనీకి రేవంత్ రెడ్డి డైరెక్టర్, 2010 లో కవిత డైరెక్టర్, సూదిని సృజన్ రెడ్డి ఇంకో డైరెక్టర్... ఇది కల్పితం కాదు. పూర్తిగా 4 లో

గిగ్ వర్కర్ల సంక్షేమానికి చట్టబద్ధ భరోసా..



- రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెడుతున్నాం

(హైదరాబాద్, సాక్షర): భారత్ జోడో యాత్రలో గిగ్ వర్కర్ల కష్టాలను స్వయంగా తెలుసుకున్న రాహుల్ గాంధీ , యూసుఫ్‌గూడ సభలో వారికి ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కార్యరూపంలోకి తీసుకొస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. 3 లో

సంపాదకీయం

డీలిమిటేషన్ అడుగులు....



దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన డీలిమిటేషన్ బిల్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటికీ రాష్ట్రపతి అధికారికంగా ముగించకపోవడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. భారతదేశంలో ఇప్పటివరకు 1952, 1963, 1973 మరియు 2002 సంవత్సరాల్లో డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటయ్యాయివర్షాకాల సమావేశాలు ఇంకా ప్రారోగ్ కానందున, కొత్త సమావేశాల కోసం 14 రోజుల గడువు అవసరం లేకుండా కేవలం 48 గంటల ముందుగా ఎంపీలకు సమాచారం ఇచ్చి ప్రత్యేక భేటీని నిర్వహించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకేతాలు ఇచ్చారు.సాధారణంగా పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుండి నాలుగు రోజుల్లోనే రాష్ట్రపతి సభను ప్రారోగ్ చేస్తారు. కానీ, ఈసారి వర్షాకాల సమావేశాలు వాయిదా పడి 90 రోజులకు చేరువవుతున్నా సభను అధికారికంగా ముగించకపోవడంతో 2008 నాటి 87 రోజుల రికార్డు సైతం బద్దలైంది. గత ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో లోక్‌సభ స్థానాలను 543 నుండి 850 వరకు పెంచేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో అది వీగిపోయింది.ఈ నేపథ్యంలో, ఈసారి పక్కా సంఖ్యాబలాన్ని కూడగట్టుకుని, ఎప్పుడైనా సరే 48 గంటల షార్ట్ నోటీసుతో సభను సమావేశపరిచి బిల్లును గట్టెక్కించాలని కేంద్రం వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో పలు దఫాలు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. 1952, 1955 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కొన్ని ఉమ్మడి నియోజకవర్గాలుగా ఉండేవి. వీటిలో ఒకరు సాధారణ అభ్యర్థి, మరొకరు రిజర్వుడు అభ్యర్థిగా ఉండేవారు. ఆ తరువాత ఈ విధానం మారిపోయింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను విభజించాలన్న డీ లిమిటేషన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరిగింది.ప్రస్తుతం 175 నియోజకవర్గాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వివిధ ఎన్నికల సమయంలో ఏ విధంగా పెరిగిందో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. 1955లో 245 నియోజకవర్గాలుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తర్వాత ఎన్నికలకు 300 స్థానాలకు చేంది తర్వాత మళ్లీ తగ్గిపోయింది. దీనికి కారణం జనాభా పెరుగుదల మేరకు డీ లిమిటేషన్ సిఫార్సులే.ఎంతమంది ప్రజలకు ఎంతమంది ప్రజాప్రతినిదులు ఉండాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు డీ లిమిటేషన్ అమల్లోకి వచ్చింది. దేశంలో 1952 నాటికి 494 పార్లమెంటు స్థానాలు ఉండేవి 1962లో 522 పార్లమెంటు స్థానాలు, 3,771 అసెంబ్లీ స్థానాలకు పెరిగాయి. 1972లో 543 పార్లమెంటు స్థానాలు 3,997 అసెంబ్లీ స్థానాలుండగా ఆ సంఖ్య 2002లో 543 పార్లమెంటు స్థానాలకు, 4,123 అసెంబ్లీ స్థానాలకు చేరింది. ప్రతి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య మారుతుంటుంది. 1953లో చంద్రశేఖర అయ్యర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా 1973లో జేఎల్ కపూర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా పార్లమెంటు సభ్యులుండాలన్న ప్రతిపాదనలతో సంఖ్య పెరిగింది 2002లో నియమితులైన కులదీప్ సింగ్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన సిఫార్సులు 2008 నుంచి అమల్లోకి వచ్చాయి.మరోవైపు, కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. 2026 నాటికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియే 'డీలిమిటేషన్' ఇది మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడి ఉంది. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో స్థానాలు పెరిగి, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల (తెలుగు రాష్ట్రాలతో సహా) ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.2026 తర్వాత జనాభా గణన ఆధారంగా లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి సుమారు 850 వరకు పెరిగే అవకాశం ఉంది. నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ బిల్లు) ప్రకారం, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో స్థానాలు పెరుగుతాయి, కానీ జనాభా నియంత్రణ పాటించిన తెలుగు రాష్ట్రాలు , కేరళ, తమిళనాడు రాష్ట్రాల ప్రాతినిధ్యం (లోక్‌సభ సీట్లు) తగ్గుతుందనే భయం ఉంది. అభివృద్ధి, జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను నష్టపరిచే విధంగా ఈ విభజన ఉండకూడదని పలువురు ఎంపీలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ బిల్లుపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి, ఇది దేశ రాజకీయ సమతుల్యతను మార్చే అవకాశం ఉన్నందున చాలా సున్నితమైన అంశంగా మారింది.రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన రెండు మూడొంతుల మెజారిటీని అడ్డదారిలో కూడగట్టుకునేందుకు అమిత్ షాకు సమయం ఇవ్వడానికే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్‌ను ప్రారోగ్ చేయకుండా జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి నాలుగుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల్లోనే ఢిల్లీ రాజకీయాలు మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

మొదటి పేజీ తరువాయి తెలంగాణ రాష్ట్రానికి కారణమే కేసీఆర్

ఈ నెల 29 న అలుగునూరులో భారీ బహిరంగ సభ. కరీంనగర్ జిల్లా మొత్తం అట్టహాసంగా ఈ నెల 29 న సంబరాలు జరుపుతాము. తెలంగాణ రాష్ట్రానికి కారణమే కేసీఆర్. తెలంగాణ భూమి ఉన్నంత కాలం కేసీఆర్ పేరు ఉంటుంది ఈ నెల 29 న పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ దీక్షా దివాస్ సందర్భంగా ఈ నెల 29 న అలుగునూరులో భారీ బహిరంగ సభ. క్విట్ ఇండియా నినాదం మనందరికీ ఒక స్ఫూర్తి. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో మనందరికీ స్ఫూర్తి. తెలంగాణ ఉద్యమాన్ని ఇందిరా గాంధీ అణిచివేసింది. సీమాంధ్రులు అనేక కుటిల రాజకీయాలు చేశారు. అలాంటి సమయంలో కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చాడో నిర్ణయం. కేసీఆర్ ఆమరణ దీక్షతో యావత్ తెలంగాణ ఒక తాటిపైకి వచ్చింది. ఆమరణ దీక్ష చేస్తున్న కేసీఆర్ అరెస్ట్ చేశారు. ఖమ్మం జైల్లో కేసీఆర్ ను నిర్బంధించారు. నిమ్స్ ఆసుపత్రికి కేసీఆర్ ను తరలించాలని డిమాండ్ చేశాము. తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆందోళనలు జరిగాయి. డిసెంబర్ 09 తెలంగాణ పక్రియ మొదలవుతుందనీ ప్రకటన వచ్చింది. సీమాంధ్రుల కుటిల రాజకీయాలకు చిదంబరం ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. తెలంగాణ ప్రకటన వెనక్కి తీసుకున్నప్పుడు అందరూ ఏకం అయ్యారు. ఐకాసాలు లు అప్పుడే మొదలయ్యాయి. ఆ తర్వాత పోరాటాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. అందుకే ఈ నెల 29 అలుగునూరులో భారీ బహిరంగ సభ. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీది చాలా పెద్ద పాత్ర. సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన రాలేదు. ఇదే విషయం నేను ట్వీట్ చేశాను. కాంగ్రెస్ పార్టీలో సైతం చర్చ జరుగుతుందని అన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ నవంబర్ 29 రోజు చరిత్ర ఉన్నంత కాలం గుర్తుంటుంది. నవంబర్ 29 న తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణకు జరుగుతున్న అన్యాయం కేసీఆర్ గళం విప్పాడు. దీక్షా దివాస్ గురించి చాలా మందికి తెలియాల్సి ఉంది. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో నినాదంతో తెలంగాణ వచ్చింది. తెలంగాణ వచ్చిన తరువాత రాష్ట్రాన్ని కేసీఆర్ అభివృద్ధి చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు. తెలంగాణ ఉద్యమం పై తుపాకీ పట్టుకొని వెళ్లిన వ్యక్తి ముఖ్యమంత్రి. ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకమని అన్నారు.జ మాజీ మంత్రి టి జీవన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టాడు. కేసీఆర్ ఆమరణ దీక్షతో చిదంబరం ప్రకటన చేశాడు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో నినాదంతో తెలంగాణ సాధించాము. నవంబర్ 29 దీక్షా దివాస్ రాష్ట్రం మొత్తం నిర్వహించుకుంటున్నాము. ఈ సభకు కేటీఆర్ హాజరు అవుతారు. సభను సక్సెస్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎల్ .రమణ మాట్లాడుతూ కామన్ మినిమం పోగ్రామ్ లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరగలేదు. తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ ఆమరణ దీక్షకు దిగాడు. కేసీఆర్ ఆమరణ దీక్షతో కేంద్రం దిగి వచ్చింది. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో నినాదంతో ఆమరణ దీక్ష. అలుగునూరు వద్ద దీక్ష చేస్తున్న కేసీఆర్ అరెస్ట్ చేశారు. కేంద్రం దిగి వచ్చి తెలంగాణ ప్రకటన చేసిందని అన్నారు. ప్రెస్ మీట్ లో మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి ,కోరుకంటి చందర్ ,సుంకె రవి శంకర్ ,కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రవీందర్ సింగ్ ,చిరుమళ్ల రాకేష్ కుమార్ ,జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ తుల ఉమ ,బీ ఆర్ ఎస్ వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,పార్టీ నేతలు రవీందర్ రెడ్డి ,విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు

మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచే ఎందుకు ప్రారంభించరు?



- STP కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- వికారాబాద్ అభివృద్ధికి నిధులు ఎక్కడ?
- సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై మెతుకు ఆనంద్ ప్రశ్నల వర్షం

వికారాబాద్:: వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రం (STP)ను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా STP కేంద్రం పనితీరును పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు. మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నది పుట్టిన ప్రాంతం నుంచే శుద్ధి కార్యక్రమాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని మెతుకు ఆనంద్ ప్రశ్నించారు. ముందుగా మూసీ నది మూల ప్రాంతాన్ని శుభ్రం చేయకుండా, దిగువ ప్రాంతాల నుంచి ప్రక్షాళన చేపడతామనడం ఎంతవరకు సమంజసమని వ్యాఖ్యానించారు. మూసీ ప్రక్షాళనలో వికారాబాద్ ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కొడంగల్‌లో మూడు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో వికారాబాద్ జిల్లా అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అడిగారు? ఎన్ని నిధులు సాధించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్యమంత్రి వద్ద జిల్లా అభివృద్ధికి నిధులు అడిగారా? అడిగినా ప్రభుత్వం స్పందించలేదా? అని ప్రశ్నించారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి శాసనసభ స్పీకర్‌గా ఉండటంతో వికారాబాద్ ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్నారని, కొడంగల్ తర్వాత వికారాబాద్ జిల్లాకే అధిక నిధులు వస్తాయని భావించారని పేర్కొన్నారు. అయితే జిల్లా అభివృద్ధి విషయంలో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. వికారాబాద్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జిల్లా అభివృద్ధి విషయంలో అనుసరిస్తున్న వైఖరిపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి, ప్రజల ఆత్మగౌరవం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, జిల్లా ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని డాక్టర్ మెతుకు ఆనంద్ స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి ఇంటర్ బోర్డు రద్దు సరే... ప్రత్యామ్నాయం సంగతేంటీ

నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ, 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా పాఠశాల విద్యాశాఖను పునర్వ్యవస్థీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. పదో తరగతి తర్వాత గ్రామీణ, పేద, ముఖ్యంగా బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల్లో దాదాపు 40 శాతం మేర నమోదవుతున్న డ్రాపౌట్లను అరికట్టడం, కార్పొరేట్ జూనియర్ కాలేజీల మార్కుల వేట నుంచి విద్యార్థులకు విముక్తి కలిగించడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది.విధానపరంగా ఈ సంస్కరణ అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆచరణలోకి వచ్చేసరికి అడుగడుగునా పెను సవాళ్లు పొంచి ఉన్నాయి. రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే కనీస మౌలిక సదుపాయాలు, సరిపడా తరగతి గదులు, ప్రయోగశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 11, 12 తరగతులను పాఠశాలల్లో విలీనం చేస్తే, ఆ స్థాయి విద్యార్థులకు అవసరమైన సైన్స్ ల్యాబ్‌లు, అదనపు గదులు, క్రీడా మైదానాలను కేవలం ఒక్క ఏడాది వ్యవధిలో యుద్ధప్రాతిపదికన సమకూర్చడం ప్రభుత్వానికి తలకు మించిన భారంగా మారనుంది.అన్నింటికంటే క్లిష్టమైన సమస్య ఉద్యోగ, సర్వీస్ నిబంధనల వివాదం . పాఠశాల విద్యాశాఖ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలోని జూనియర్ లెక్చరర్ల సర్వీస్ రూల్స్, వేతన స్కేళ్లు, పదోన్నతుల ప్రక్రియ పూర్తిగా భిన్నమైనవి. ఈ రెండు విభాగాలను విలీనం చేస్తే సీనియారిటీ వివాదాలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికే జూనియర్ లెక్చరర్ల సంఘాలు ఈ విలీనాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి. వారి ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదని సీఎం హామీ ఇచ్చినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు లేకుండా సర్వీస్ నిబంధనలను ఏకీకృతం చేయడం అధికారులకు కత్తిమీద సాములాంటిదే.మరోవైపు, దశాబ్దాలుగా రాష్ట్రంలో సమాంతర విద్యా సామ్రాజ్యాన్ని నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీల లాబీ ఈ మార్పును అంత సులభంగా అంగీకరించే పరిస్థితి లేదు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల వ్యాపారంతో నడుస్తున్న ఈ కార్పొరేట్ కళాశాలలు, 11, 12 తరగతులను పాఠశాలల్లో విలీనం చేస్తే తమ అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అలాగే, ఇంటర్ మార్కుల

మొదటి పేజీ తరువాయి కేసీఆర్ పెనుముప్పు నుంచి రక్షించారు..

రూ.1000 కోట్ల కాలువ పని సృజన్ రెడ్డికి వచ్చే వరకు కవిత వదల్లేదు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు భూకంపం వచ్చిన ప్రాంతంలో నిర్మించారని కవిత అన్నారు. కేంద్ర జలసంఘం, జీఎస్ఐ నుంచి అనుమతులు వచ్చిన తర్వాతే 50 టీఎంసీల జలాశయం కట్టాలని నిర్మించారు.కేసీఆర్ ఆదేశాలు, హరీశ్ రావు పర్యవేక్షణలో ఇంజనీర్లు నిర్ణయం తీసుకున్నారు విజిలెన్స్ విభాగం నివేదికలను సీఎంకు పంపుతుంది కానీ, రహస్యంగా తయారు చేసిన ఆ నివేదికలు కవితకు ఎలా వచ్చాయి..? రేవంత్ రెడ్డి ఇచ్చినట్లే కదా... అధికారిక రహస్యాల ఉల్లంఘన కాదా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. 19న సిద్దిపేటలో సీఎం ఈ అంశాలనే మాట్లాడతారు.. రేవంత్ రెడ్డి కవితను సిద్దిపేటకు వెళ్లమని చెప్పారు, స్క్రిప్ట్ ఇచ్చారు... అవే మళ్లీ మాట్లాడతారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. కవితకు కామన్ సెన్స్ లేకపోవడం నవ్వు వస్తోందని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి కేసీఆర్ ఫాంహౌస్‌కు కాల్వ వెళ్లిందని అంటున్నారు. రిజర్వాయర్ కింద కేసీఆర్ భూమికి కూడా నీరు వెళ్తే కవితకు ఏం ఇబ్బంది.. ? రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ ఇస్తే కవిత మాట్లాడుతున్నారు. నిమ్స్ లో హరీశ్ రావు రూ.200 కోట్ల కుంభకోణం చేశారని కవిత అన్నారు. కవిత ఉద్యోగుల పక్షమా... రేవంత్ రెడ్డి పక్షమా...?: నిమ్స్ లోని ఉద్యోగుల ఈపీఎస్ సరిగ్గా అందుకోవడంతో జీపీఎఫ్‌కు వెళ్తామని అన్నారు. పాంచజన్యం పేరుతో పచ్చి అబద్ధాలు చెప్పడంలో కవిత దిట్ట. జీపీఎఫ్ ఉద్యోగుల డబ్బులు ఈపీఎఫ్ కు ఇస్తున్నారని జీపీఎఫ్ ఉద్యోగులు కవితకు ఫిర్యాదు చేశారని అనడం విడ్డూరంగా ఉందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. హరీశ్ రావు చేసిన తప్పేమిటి..? మంత్రిగా ఉద్యోగులకు ఈపీఎఫ్ ఇప్పించడం తప్పా..? ప్రస్తుత సలహాదారు రామకృష్ణారావుతోపాటు ఐఏఎస్ అధికారులు, వైద్యులు సంతకం చేశారు కదా..! పెన్షన్ వద్దు అని ఏ ఉద్యోగి అయినా ఫిర్యాదు చేస్తారా..? హరీశ్ రావును విమర్శించాలని సోయి లేకుండా మాట్లాడుతున్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తారంటే ఎలా..? అని ప్రశ్నించారు. నివేదికలు కవిత వద్దకు ఎలా వెళ్తాయి..?: కవిత పేరు చెప్పి ఆసుపత్రుల వద్దకు ఎవరైనా వస్తే... ఆసుపత్రుల ఉద్యోగులు నిలదీయాలి.. రేవంత్ రెడ్డి ఇచ్చాడు కాబట్టే... కవితకు అన్ని రికార్డులు వెళ్తున్నాయి.. లేని నివేదికలు సృష్టించే శాఖను రేవంత్ రెడ్డి సృష్టించి కవితకు అన్ని వివరాలు అందిస్తున్నారు. రేవంత్ రెడ్డి, కవిత, సృజన్ రెడ్డి కలిసి వ్యాపారాలు చేశారు. ఒకే చిరునామాతో 30 కంపెనీలు ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతల భూములపై అక్రమంగా విచారణకు జీఓ ఇచ్చారు, కాంగ్రెస్ నేతల భూములు కూడా చేర్చాలని అంటున్నాం. విజిలెన్స్ విభాగం వద్ద ఉండాల్సిన నివేదికలు కవిత వద్దకు ఎలా వెళ్తాయి..? అని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అడిగారు.

మొదటి పేజీ తరువాయి మూడు బడ్జెట్లు.. అవే హామీలు.. అమలెక్కడ?..

విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తామని చెప్పి.. ఇప్పటివరకు ఒక్క శాతం కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో భాగంగా పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించే 'అంబేడ్కర్ అభయహస్తం' పథకాన్ని ప్రకటించారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 31 శాతం వాటా కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ రెండు హామీల అమలులోనూ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. యూత్ డిక్లరేషన్‌లో భాగంగా 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ తెలిపారు. కానీ ఇప్పటివరకు 10 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఆశించిన ప్రయోజనం అందలేదని విమర్శించారు. విద్యార్థులకు రూ.5 లక్షల 'విద్యా భరోసా కార్డు' ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. మైనారిటీ డిక్లరేషన్‌లో భాగంగా రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు రూ.వెయ్యి కోట్ల లోపే కేటాయించారని ఆరోపించారు. ఇలా ప్రతి వర్గానికి ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 'అబద్ధాలు.. పచ్చి అబద్ధాలు.. వాటన్నింటికీ మించి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అభయహస్తం' అంటూ కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి వాలంటీర్ల వ్యవస్థ దిశగా అడుగులు

ప్రతి 50 నుంచి 100 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించడం ద్వారా గ్రామాలు, వార్డుల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చనేది వ్యూహకర్తల అంచనా. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి 'ప్రజాబలం' పేరుతో గ్రామీణ పర్యటనలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల్లో సానుకూలతను పెంచే వారధిగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. అంతేకాకుండా, చదువుకున్న లక్ష మంది నిరుద్యోగ యువతకు నెలకు సుమారు రూ.10 వేల గౌరవ వేతనంతో ఉపాధి కల్పించినట్లవుతుందని ప్రభుత్వం భావిస్తోందిఅయితే, ఈ విధానం అమలుపై రాజకీయ విశ్లేషకుల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2.5 లక్షల మందితో గ్రామ, వార్డు వాలంటీర్ల వ్యవస్థను అమలు చేసింది. ప్రారంభంలో పథకాల డెలివరీ వేగవంతమై ప్రజాదరణ లభించింది. అయితే రానురాను ఆ వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీ కార్యకర్తలకే ఉద్యోగాలు కట్టబెట్టారనే విమర్శలతో పాటు, ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి రాజకీయ అవసరాలకు వాడుకున్నారనే ఆరోపణలు ఆ ప్రభుత్వానికి పెద్ద మైనస్‌గా మారాయి. పైగా సొంత పార్టీ నేతలే వాలంటీర్ వ్యవస్థ వల్ల తమను ఎవరూ దేకట్లేదనే ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను రద్దు చేసింది.తెలంగాణలో ఇదే తరహా వ్యవస్థను ప్రవేశపెడితే, రేవంత్ సర్కార్ పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గ్రూప్స్, డీఎస్సీ వంటి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను గౌరవ వేతనంతో కూడిన తాత్కాలిక పోస్టులతో మభ్యపెడుతున్నారనే విమర్శను ప్రతిపక్షాలు అస్త్రంగా మలుచుకుంటాయి. నియామకాల్లో పారదర్శకత లోపిస్తే, ప్రభుత్వ ఖజానా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలకు జీతాలు ఇస్తున్నారనే ప్రచారం ఊపందుకుంటుంది. పౌరుల వ్యక్తిగత డేటా భద్రత, చట్టబద్ధత లేని నియామకాలపై న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఉన్న సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల అధికారాలకు వలంటీర్ల వ్యవస్థ సమాంతర అధికార కేంద్రంగా మారితే స్థానికంగా ఘర్షణ వాతావరణం నెలకొనవచ్చు.లక్ష మంది వలంటీర్ల ఆలోచన పరిపాలనాపరంగా వేగాన్ని పెంచే సాధనమే కావచ్చు. కానీ, ఏపీ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, పక్కా విధివిధానాలు, పూర్తి పారదర్శకతతో, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా దీనిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంది. లేదంటే, సంక్షేమం కోసం వేస్తున్న ఈ అడుగు ప్రభుత్వానికి రాజకీయంగా బూమరాంగ్ అయ్యే ప్రమాదం పొంచి ఉంది.

మొదటి పేజీ తరువాయి గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..

గతంలో వారి సంక్షేమంపై జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని ఇప్పుడు నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లను మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ వెట్టిచాకిరీ కార్మికులుగా మార్చాలని చూస్తున్నాయని ఆరోపించారు. వారిని బానిసలుగా మార్చి దోపిడీ చేయాలనుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్మికులను సేవకులుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఫోన్‌లోనే పని, ఆదాయ వివరాలు: గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించడమే కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని రాహుల్ తెలిపారు. ప్రతి డెలివరీకి సంబంధించిన వివరాలు, చేసిన శ్రమ, దానికి లభించే ప్రతిఫలం నేరుగా వారి మొబైల్ ఫోన్లలోనే అందుబాటులో ఉంటాయని చెప్పారు. గిగ్ వర్కర్ల సౌకర్యార్థం వైపై వసతితో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు గిగ్ వర్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్త చట్టం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ వర్కర్ల బోర్డు ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్మికుల హక్కులు, వారి కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎన్నికల సమగ్రతే ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాది



- భారత్ సమ్మిట్‌లో ఎన్నికల సమగ్రతపై జరిగిన ప్యానెల్ చర్చలో ఎమ్మెల్యే కవ్వంపల్లి

(కరీంనగర్, సాక్షర): ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో ఎన్నికల సమగ్రత కీలక పాత్ర పోషిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ, హైటెక్స్ వేదికగా జరుగుతున్న భారత్ సమ్మిట్–2026 రెండో ఎడిషన్‌లో భాగంగా శనివారం నిర్వహించిన 'ఎన్నికల సమగ్రత – తెలంగాణ, భారతదేశం' అనే అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ పారదర్శకమైన ఓటరు జాబితాల నిర్వహణ, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం వంటి అంశాలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉంటుందని, ముఖ్యంగా అట్టడుగు వర్గాల ఓటు హక్కులకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ ప్యానెల్ చర్చలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, విద్యా కమిషన్ సభ్యుడు చరకొండ వెంకటేష్ పాటు ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9 చలో హైదరాబాద్ ఆదివాసీ అస్తిత్వ సభను విజయవంతం చేయాలి



(ఆదిలాబాద్, సాక్షర): గాదిగూడ మండలంలోని అన్ని ఆదివాసీ గ్రామాల ప్రజలు పటేల్‌లు ఆదివాసీ 9తెగల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని డిసెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే ఆదివాసీ అస్తిత్వ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావు పిలుపునిచ్చారు . ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ గాదిగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించరు ఈ కార్యక్రమానికి సంబంధించి త్వరలోనే గాదిగూడ మండలంలోని అన్ని ఆదివాసీ గ్రామాల పటేల్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆదివాసీల హక్కులు అస్తిత్వం కోసం ప్రతి ఆదివాసీ ఒక్కటై డిసెంబర్ 9న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూజ్జాక భీంరావ్ గదిగూడ రాయి సెంటర్ సర్మీడి హెరె కుంరం నాగోరావ్ తుడుందెబ్బ మండల గౌరవ అధ్యక్షులు కొడప దేవరావు ప్రధాన్ సమాజ్ అధ్యక్షులు ఆడ రాజు మాజీ ఎంపీపీ ప్రస్తుత సర్పంచ్ మెస్రం జైవంత్ రావ్ మాజీ సర్పంచ్ గెడం శేడుము రాజగోండ్ సేవ సమితి మండల అధ్యక్షులు కుడుమేత భరత్ తుడుందెబ్బ మండల ఉపాధ్యక్షులు మాడవి భరత్ హ్యూమన్ రైట్ నాయకులు గెడం ప్రసురం మాజీ సర్పంచ్ జూజ్జాక గాగరు తుడుందెబ్బ డివిజన్ నాయకులు సోయం మనిక్ రావ్ ఆదివాసీ విద్యార్థి మండల నాయకులు హెర్ కుంరం రామారావు తుడుందెబ్బ మండల ప్రచార కార్యదర్శి ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు

శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం..

- భక్తుడిని అదుపులోకి తీసుకున్న ఎస్పీఎఫ్
- రహస్య కెమెరా ఉన్న కళ్లజోడుతో ఆలయంలోకి ప్రవేశించిన పూణె వ్యక్తి
- కెమెరా కళ్లజోడు ధరించిన భక్తుడిని గుర్తించిన అర్చకులు
- గర్భాలయ దృశ్యాలు చిత్రీకరించారా అనే కోణంలో అధికారుల విచారణ



శ్రీకాళహస్తి :ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం రేపింది. ఆలయ నిబంధనలను ఉల్లంఘించి కెమెరా అమర్చిన కళ్లద్దాలతో లోపలికి ప్రవేశించిన ఓ భక్తుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని పూణెకు చెందిన అంకేష్ అగర్వాల్ అనే భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర ఆలయ దర్శనానికి వచ్చారు. మొదట ఆయన ఆలయంలో రూ. 5,000 రుసుము చెల్లించి రాహు-కేతు నివారణ పూజ నిర్వహించారు. ఆ పూజ పూర్తయిన తర్వాత కుటుంబ సమేతంగా ప్రధాన ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్లారు. అమ్మవారి సన్నిధిలో దర్శనం చేసుకుంటుండగా, ఆయన కళ్లకు ఉన్న అద్దాలలో రహస్య కెమెరా (స్పై కెమెరా) అమర్చి ఉండటాన్ని అక్కడి అర్చకులు గుర్తించారు. విషయాన్ని గ్రహించిన అర్చకులు వెంటనే ఆలయ విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన భద్రతా సిబ్బంది సదరు భక్తుడిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఆలయ ప్రాంగణంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం, ముఖ్యంగా గర్భాలయం పరిసరాల్లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేయటంపై కఠిన నిషేధం అమల్లో ఉంది. అలాంటిది తనిఖీలను దాటుకుని స్పై కెమెరా కళ్లజోడుతో ఆలయంలోకి ఎలా రాగలిగారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆలయ అంతరాలయంలోని సున్నితమైన దృశ్యాలను ఏమైనా రికార్డ్ చేశారా అనే కోణంలో పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి..

- సైక్లింగ్‌తో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించండి:బండారు దత్తాత్రేయ
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 3,700 కి.మీ. సైక్లింగ్ యాత్రకు శ్రీకారం



(హైదరాబాద్, సాక్షర): మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతలో అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు చేపడుతున్న సైక్లింగ్ యాత్ర అభినందనీయమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 'సే నో టు డ్రగ్స్' నినాదంతో 3,700 కిలోమీటర్ల సైక్లింగ్ యాత్ర చేపడుతున్న హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ (హెచ్‌సీజీ) సభ్యులను శనివారం హైదరాబాద్‌లోని రాంనగర్‌లో అలై బలై ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఫౌండేషన్ అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొని సైక్లిస్టులను సన్మానించారు. అనంతరం యాత్రకు జెండా ఊపి శుభారంభం చేశారు. ఈ బృందంలో ఒక మహిళా సైక్లిస్ట్ ఉండటం విశేషం. ఈ నెల 19న శ్రీనగర్‌లో ప్రారంభమయ్యే యాత్ర రాంబన్, పఠాన్‌కోట్, జలంధర్, అంబాలా, ఢిల్లీ, మథుర, గ్వాలియర్, ఝాన్సీ, నాగ్‌పూర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, బెంగళూరు, మదురై తదితర ప్రాంతాల మీదుగా కన్యాకుమారికి చేరుకోనుంది. మొత్తం 3,700 కిలోమీటర్ల దూరాన్ని 21 రోజుల్లో పూర్తి చేయాలని సైక్లిస్టులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ యాత్రలో పాల్గొంటున్న గడ్డం మల్లేష్ (ఈగిల్ ఫోర్స్ పోలీస్ ఇన్‌స్పెక్టర్), సెల్వి (ఆర్మీ పాఠశాల ఉపాధ్యాయురాలు), ఉమా మహేశ్వర్ రావు, శ్రీధర్ జిన్నా, శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ శ్రీకాంత్, రఘురామ్ సూరి (తెలంగాణ హైకోర్టు న్యాయవాది)లను దత్తాత్రేయ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైక్లింగ్ వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. యువతలో సానుకూల ఆలోచనలు పెంపొందించేందుకు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్, నషా ముక్త్ తెలంగాణ స్ఫూర్తితో డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోండి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న సైక్లిస్టులకు అభినందనలు తెలిపారు. వారి యాత్ర విజయవంతంగా, సురక్షితంగా సాగాలని ఆకాంక్షించారు.

సజ్జనార్ బదిలీ వెనుక అంత కథ నడిచిందా

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ ఐపీఎస్ లలో జరిగిన భారీ ప్రక్షాళన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇందులో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ బదిలీ అందరినీ ఆశ్చర్యపరిచింది. 2025 సెప్టెంబర్ 30న హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. కేవలం 13 నెలల స్వల్ప వ్యవధిలోనే ఆ స్థానం నుంచి తప్పుకోవాల్సి రావడం అనేక సందేహాలకు తావిస్తోంది. ఆయన్ను అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర, పౌర రక్షణ విభాగం డీజీగా మరియు ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బదిలీ చేసింది. సజ్జనార్ స్థానంలో 1995 బ్యాచ్ సీనియర్ అధికారి మహేశ్ మురళీధర్ భగవత్‌ను కొత్త కొత్వాల్‌గా నియమించింది.సాధారణంగా ప్రభుత్వ యంత్రాంగంలో బదిలీలు సర్వసాధారణం. కానీ, ప్రజల్లో విపరీతమైన ఆదరణ పొందుతూ, క్షేత్రస్థాయిలో దూకుడుగా పనిచేస్తున్న అధికారిని ఏడాది తిరక్కముందే అప్రాధాన్య పోస్టుగా భావించే విభాగానికి పంపడం వెనుక లోతైన కారణాలు లేకపోలేదని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ ఆకస్మిక మార్పు వెనుక ప్రధానంగా మూడు కోణాలు కనిపిస్తున్నాయి.సజ్జనార్ ఎక్కడ పనిచేసినా తనదైన మార్క్ చూపిస్తారు. హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపారు. 'హెచ్-న్యూ' విభాగాన్ని బలోపేతం చేసి అంతర్రాష్ట్ర ముఠాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. అంతకుమించి, నగరంలో పేరుకుపోయిన ఆహార కల్తీ ముఠాలపై ఆయన చేపట్టిన ఆకస్మిక దాడులు బడా వ్యాపార వర్గాల్లో కలకలం రేపాయి. ఈ కఠిన చర్యలు కొందరికి మింగుడుపడలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ నగరానికి సీపీగా ఉండటమంటే కేవలం శాంతిభద్రతలే కాదు, ప్రభుత్వ పెద్దలతో నిరంతర సమన్వయం కూడా అత్యంత కీలకం. ఇటీవలి కాలంలో కొన్ని కీలక అంశాలు, శాంతిభద్రతల నిర్వహణ విషయంలో ప్రభుత్వ ఉన్నత స్థాయి వర్గాలకు, సజ్జనార్‌కు మధ్య కొంత గ్యాప్ ఏర్పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. స్వతంత్ర నిర్ణయాలతో దూసుకెళ్లే ఆయన శైలి, అధికార యంత్రాంగంలోని కొందరికి అసౌకర్యం కలిగించి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.అయితే సజ్జనార్ బదిలీ పూర్తిగా పరిపాలనాపరమైన మార్పుగానే ప్రభుత్వం చెప్తోంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చేపట్టబోయే కీలక పాలనా కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, అలాగే కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో అనుభవజ్ఞుడైన మహేశ్ భగవత్‌ను హైదరాబాద్ బాధ్యతలకు తీసుకువచ్చారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.1996 బ్యాచ్‌కు చెందిన సజ్జనార్ కెరీర్ ఆద్యంతం సంచలనాలే. వరంగల్ యాసిడ్ దాడి నిందితుల ఎన్‌కౌంటర్ నుంచి సైబరాబాద్ సీపీగా దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్ (2019) వరకు, ఆ తర్వాత నష్టాల్లో ఉన్న టీజీఎస్ఆర్టీసీని ఎండీగా లాభాల బాట పట్టించే ప్రయత్నం వరకు ఆయనది ప్రత్యేక శైలి. హైదరాబాద్ సీపీగా 'డే విత్ ద సీపీ' పేరుతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పోలీసుల పట్ల భయం పోగొట్టడం, మహిళల రక్షణ కోసం 'స్పందన' వాహనాలు, షీ నేత్ర బృందాలను పరుగులు పెట్టించడం, కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్ వ్యవస్థతో ట్రాఫిక్ చిక్కులు తప్పించడం వంటివి నగరవాసులకు బాగా చేరువయ్యాయి. బాధ్యతల నుంచి తప్పుకుంటూ ఆయన చేసిన భావోద్వేగ పోస్ట్, ప్రజల ఆదరణను మరువలేనని చెప్పడం చూస్తేనే నగరంతో ఆయనకున్న అనుబంధం అర్థమవుతుంది.ప్రభుత్వానికి అధికారులను బదిలీ చేసే పూర్తి హక్కు ఉంటుంది. కానీ డ్రగ్స్ రహిత హైదరాబాద్, కల్తీ లేని ఆహారం, మహిళల భద్రత కోసం సజ్జనార్ వేసిన బలమైన పునాదులు ఇప్పుడు ఏమవుతాయి? కొత్త సీపీ మహేశ్ భగవత్ ఆ సంస్కరణలను అదే వేగంతో ముందుకు తీసుకెళ్తారా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఆ దాడులకు బ్రేక్ పడుతుందా? అన్నదే సామాన్య హైదరాబాదీని వేధిస్తున్న అసలు ప్రశ్న. మంచి పనిచేస్తున్న అధికారిని పక్కకు తప్పించినప్పుడు, ఆ నిర్ణయం వెనుక ఉన్న హేతుబద్ధతను ప్రజలకు వివరించాల్సిన నైతిక బాధ్యత పాలకులపై ఎప్పుడూ ఉంటుంది.

మొదటి పేజీ తరువాయి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

దేశానికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి నిరంతరం నీతులు చెప్పే కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో ప్రతిపక్ష నాయకులను అక్రమంగా హౌస్ అరెస్టులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని బహిరంగంగా కాలరాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్నది 'భారత్ సమ్మిట్' కాదు, అది ముమ్మాటికీ 'యాంటీ-భారత్ సమ్మిట్' * తెలంగాణ ప్రజల కష్టార్జిత పన్నుల సొమ్మును వృథా చేస్తూ, రాజకీయంగా విఫలమైన రాహుల్ గాంధీని మరోసారి రాజకీయంగా రీలాంచ్ చేయడానికి, దేశ వ్యతిరేక శక్తులకు వేదికగా నిలుస్తున్న ఈ సదస్సును భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దేశ వ్యతిరేక శక్తులను ఏకం చేసే ఈ సదస్సును నిరసిస్తున్నందుకే ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగింది. రాజకీయంగా వరుస వైఫల్యాలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను పిలిచి దేశంలో అస్థిరతను సృష్టించే ప్రయత్నం చేస్తోంది, దీన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు పోలీసులను ఉపయోగిస్తోంది. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన ప్రభుత్వానికి నిరసనలను అడ్డుకునే నైతిక హక్కు లేదు. శాంతియుత నిరసనలకు భయపడి రాష్ట్ర అధ్యక్షుడిని హౌస్ అరెస్ట్ చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు.

మొదటి పేజీ తరువాయి గిగ్ వర్కర్ల సంక్షేమానికి చట్టబద్ధ భరోసా..

శనివారం రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమానికి వివేక్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ గిగ్ వర్కర్ల హక్కులు, సంక్షేమానికి రక్షణగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాం. ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి గిగ్ వర్కర్‌కు బీమా రక్షణతో పాటు రిజిస్ట్రేషన్ పోర్టల్, సమస్యల పరిష్కార వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. కార్మికులు సంతోషంగా, భద్రంగా ఉన్నప్పుడే కంపెనీలు అభివృద్ధి చెందుతాయని నేను బలంగా నమ్ముతున్నాను. అగ్రిగేటర్లు గిగ్ వర్కర్లను తమ కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలి. వారి శ్రమకు గుర్తింపు, గౌరవం, భద్రత కల్పించడమే మా లక్ష్యమని అన్నారు. భారత్ సమ్మిట్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేయడం మానుకుని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాలను కోరుతున్నానని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

అమెరికాలో గంటలపాటు నిలిచిన 11వేల విమానాలు..

ప్రాంతీయ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ల వద్ద కమ్యూనికేషన్ వ్యవస్థల్లో సాంకేతిక సమస్య కారణంగా అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అమెరికా వ్యాప్తంగా విమానాల టేకాఫ్‌లను నిలిపివేయాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఆదేశించారు. దీంతో వేలాది విమాన సర్వీసులపై ప్రభావం పడింది. దాదాపు 10వేల విమానాలు ఆలస్యమయ్యాయని, మరో 1000 సర్వీసులు రద్దయ్యాయని ఫ్లైట్ ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్ అవేర్' డేటా వెల్లడించింది. కొన్ని వందల విమానాలను దారిమళ్లించారు. దీంతో దాదాపు 15లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రాయాల్లో పడిగాపులు కాశారు. ఓవర్‌లోడ్ వల్లే..: 22 ప్రాంతీయ ఏటీసీ కేంద్రాల్లో కమ్యూనికేషన్ సమస్య తలెత్తింది. కాలం చెల్లిన టెలికమ్యూనికేషనల్ మౌలిక సదుపాయాలు, ఓవర్‌లోడ్ స్విచ్‌లు, రూటర్ల కారణంగా సాంకేతిక వైఫల్యం నెలకొన్నట్లు అమెరికా రవాణా మంత్రి సీన్ డఫీ వెల్లడించారు. అమెరికా ఏటీసీ వ్యవస్థలు చాలా పాతవని, ఇప్పటికీ అనలాగ్ సిస్టమ్స్‌పైనే ఆధారపడినట్లు పేర్కొన్నారు. అందుకే డేటా ఎక్కువగా ఉన్నప్పుడు ఓవర్‌లోడ్ సమస్య తలెత్తుతున్నట్లు తెలిపారు. ''ఈ సమస్య కారణంగా మేం రాడార్లు, టెలికమ్యూనికేషన్ సామర్థ్యాలను పూర్తిగా కోల్పోలేదు. అయితే, భద్రతా కారణాలు, ప్రయాణికుల రక్షణ దృష్ట్యా విమానాలను నిలిపివేయాలని నిర్ణయించాం'' అని సీన్ డఫీ స్పష్టం చేశారు. ఎఫ్ఏఏ ఆదేశాలు జారీ చేసినప్పుడు దాదాపు 3500 విమానాల్లో గాల్లోనే ఉన్నాయి. అవన్నీ అత్యవసరంగా సమీప ఎయిర్‌పోర్టుల్లో ల్యాండయ్యాయి. సమస్యను పరిష్కరించిన అనంతరం దాదాపు నాలుగు గంటల తర్వాత ఎఫ్ఏఏ తన గ్రౌండ్ ఆర్డర్స్‌ను ఎత్తివేసింది. దీంతో విమాన సర్వీసులను పునరుద్ధరించేందుకు ఎయిర్‌లైన్లకు అనుమతి లభించింది. అయితే, సాధారణ స్థితికి వచ్చేందుకు మరికొంత సమయం పట్టొచ్చని అధికారులు చెబుతున్నారు. సైబర్ దాడి కాదు: ట్రంప్ ఈ పరిణామాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇది సైబర్ దాడి లేదా కృత్రిమ మేధ కారణంగా ఏర్పడిన సమస్య కాదని ఆయన తెలిపారు. మైక్రోసాఫ్ట్ సర్వీసులకు అంతరాయం ఏర్పడిన సమయంలోనే విమాన సేవలు నిలిచిపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, దీనికి తమ సేవలతో ఎలాంటి సంబంధం లేదని టెక్ దిగ్గజం వెల్లడించింది. 2023 జనవరిలోనూ ఈ తరహా సమస్య తలెత్తింది. సాంకేతిక వైఫల్యం కారణంగా నాడు ఎయిర్‌లైన్లకు ఎఫ్ఏఏ అధికారులు నోటమ్ జారీ చేశారు. దీంతో వేలాది విమానాలు ఎయిర్‌పోర్టులకే పరిమితమయ్యాయి. ఇక, 2001 సెప్టెంబరు 11న అగ్రరాజ్యంలో చోటుచేసుకున్న భీకర ఉగ్రదాడి సమయంలోనూ విమానాలను ఇలాగే నిలిపివేశారు. అయితే, ఇది మరో 9/11 కాదని ఏవియేషన్ అధికారులు వెల్లడించారు.

మొదటి పేజీ తరువాయి చైనాలో అగ్రరాజ్యాల అరుదైన భేటీ..

అయితే, ఈ ముగ్గురు నేతలు కలవడం చరిత్రాత్మకమే అయినప్పటికీ, ఈ చర్చల ద్వారా పెద్దగా ఫలితాలు వస్తాయని ఆశించలేమని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం ప్రతీకాత్మక సమావేశంగానే మిగిలిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు దేశాల మధ్య సంబంధాలు సంక్లిష్టంగా ఉన్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా-ఇరాన్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఈ సమావేశం జరగడం గమనార్హం. అణ్వస్త్ర ఒప్పందమే ప్రధాన అజెండా: ముఖ్యంగా ఇరాన్‌తో యుద్ధం, అణ్వస్త్ర నిల్వలపై మూడు దేశాల మధ్య ఒక కొత్త ఒప్పందం కుదుర్చుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశం ఉపయోగపడుతుందని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికా, రష్యాల మధ్య ఉన్న చివరి అణ్వస్త్ర ఒప్పందం (న్యూ స్టార్ట్) గత ఫిబ్రవరిలోనే ముగిసింది. దీంతో అర్ధ శతాబ్దం తర్వాత తొలిసారిగా ప్రపంచంలోని రెండు అతిపెద్ద అణు నిల్వలపై ఎలాంటి పరిమితులు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో చైనాను కూడా భాగస్వామ్యం చేస్తూ కొత్త ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ ప్రతిపాదిస్తున్నారు. అయితే, ఈ ప్రతిపాదనపై చైనా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అమెరికా, రష్యాల వద్ద సుమారు 5,000కు పైగా అణ్వస్త్రాలు ఉండగా, చైనా వద్ద కేవలం 600 మాత్రమే ఉన్నాయని అంచనా. తమకన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా అణ్వస్త్రాలు ఉన్న దేశాలతో సమానంగా ఒప్పందం చేసుకోవడానికి బీజింగ్ విముఖత చూపుతోంది. అయినప్పటికీ, ఈ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రపంచంలో తమ పెరుగుతున్న పలుకుబడిని, ప్రతిష్టను చాటుకోవాలని జిన్‌పింగ్ భావిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. నేతల వ్యక్తిగత ప్రయోజనాలు: మరోవైపు, అమెరికా, చైనాలతో సమానంగా తమను కూడా ఒక అగ్రరాజ్యంగా ప్రదర్శించుకోవడానికి పుతిన్‌కు ఈ భేటీ ఒక సువర్ణావకాశం. ముఖ్యంగా ఉక్రెయిన్ విషయంలో తామే కీలక నిర్ణయాలు తీసుకుంటామనే సంకేతాలు పంపాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పుతిన్, జిన్‌పింగ్ మధ్య బలమైన స్నేహబంధం ఉంది. అదే సమయంలో ట్రంప్ కూడా ఇరు నేతలతో సంబంధాలు మెరుగుపరుచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమావేశం ద్వారా ఉక్రెయిన్ విషయంలో తమ ప్రమేయం లేకుండా ఏదైనా ఒప్పందం కుదుర్చుకుంటారేమోనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం మీద ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించే ఈ ముగ్గురు నేతల భేటీలో ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మొదటి పేజీ తరువాయి చాట్ జీపీటీ కొత్త ఫీచర్...

ఆ తర్వాత 'డాట్స్' అని పిలిచే ఏఐ ఏజెంట్లు యూజర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో వస్తువులను కొనుగోలు చేసేందుకు సిద్ధం చేస్తాయి. చెల్లింపు దశకు వచ్చినప్పుడు, యూజర్‌కు ఒక నోటిఫికేషన్ వస్తుంది. అందులో కొనుగోలు చేస్తున్న వస్తువులు, మొత్తం ధర, ఉపయోగించబోయే కార్డు వివరాలు ఉంటాయి.యూజర్ వీటన్నిటినీ సమీక్షించి, ఫేస్ ఐడీ లేదా వేలిముద్ర వంటి బయోమెట్రిక్ భద్రతా పద్ధతి ద్వారా లావాదేవీని ఆమోదించాల్సి ఉంటుంది. ఆమోదం పొందిన వెంటనే, పేమెంట్ నెట్‌వర్క్ అసలు కార్డు వివరాలకు బదులుగా ఒక తాత్కాలిక డిజిటల్ టోకెన్‌ను సృష్టిస్తుంది. ఈ టోకెన్ ద్వారా మాత్రమే చెల్లింపు జరుగుతుంది. దీనివల్ల అసలు కార్డు వివరాలు ఏఐ ఏజెంట్‌కు గానీ, వ్యాపారికి గానీ చేరవు. తద్వారా ఆర్థిక లావాదేవీలకు పూర్తి భద్రత లభిస్తుంది.

ప్రస్తుత లభ్యత.. ఇతర ప్రయోజనాలు

ప్రస్తుతానికి ఈ సేవలు అమెరికాలోని 18 ఏళ్లు పైబడిన చాట్‌జీపీటీ ప్రో సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వారు తమ కార్డులను దీనికి అనుసంధానం చేసుకోవచ్చు. ఈ వాలెట్ ద్వారా జరిపే కొనుగోళ్లకు కూడా సాధారణ కార్డు లావాదేవీల మాదిరిగానే రివార్డ్ పాయింట్లు, నాణ్యత లేని వస్తువుల విషయంలో వివాదాల పరిష్కారం వంటి రక్షణలు వర్తిస్తాయని ఓపెన్‌ఏఐ స్పష్టం చేసింది. మోసాలను నివారించేందుకు ప్రత్యేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, ఏజెంట్ల ద్వారా జరిగే కొనుగోళ్లను సులభంగా ప్రాసెస్ చేసేలా వ్యాపారులకు మార్గదర్శకాలు అందిస్తున్నామని తెలిపింది.భవిష్యత్తులో నిర్దిష్ట ఖర్చు పరిమితులు, వస్తువుల కేటగిరీలు లేదా నిర్ణీత కాల వ్యవధిలో స్వయంచాలకంగా కొనుగోళ్లు జరిపేందుకు ఏజెంట్లకు అనుమతులు ఇచ్చే దిశగా పనిచేస్తున్నామని, అయితే దీనికి మరిన్ని భద్రతా ప్రమాణాలు అవసరమని కంపెనీ వివరించింది. ప్రస్తుత పరిమిత విడుదల ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, వ్యవస్థను మరింత మెరుగుపరిచి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని ఓపెన్‌ఏఐ లక్ష్యంగా పెట్టుకుంది

మొదటి పేజీ తరువాయి కాంగ్రెస్ 'అభయహస్తం' హామీలన్నీ ఏమయ్యాయి?..

బీసీ డిక్లరేషన్‌లో భాగంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ మూడేళ్లలో రూ.5 వేల కోట్ల లోపే కేటాయించారని ఆరోపించారు. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తామని చెప్పి.. ఇప్పటివరకు ఒక్క శాతం కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో భాగంగా పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించే 'అంబేడ్కర్ అభయహస్తం' పథకాన్ని ప్రకటించారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 31 శాతం వాటా కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ రెండు హామీల అమలులోనూ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. యూత్ డిక్లరేషన్‌లో భాగంగా 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ తెలిపారు. కానీ ఇప్పటివరకు 10 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఆశించిన ప్రయోజనం అందలేదని విమర్శించారు. విద్యార్థులకు రూ.5 లక్షల 'విద్యా భరోసా కార్డు' ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. మైనారిటీ డిక్లరేషన్‌లో భాగంగా రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు రూ.వెయ్యి కోట్ల లోపే కేటాయించారని ఆరోపించారు. ఇలా ప్రతి వర్గానికి ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 'అబద్ధాలు.. పచ్చి అబద్ధాలు.. వాటన్నింటికీ మించి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అభయహస్తం' అంటూ కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి క్యూబాలో ఆకలి కేకలు

అమెరికా ఇంధన ఆంక్షలు, పెరిగిన ద్రవ్యోల్బణం, తరుగుతున్న ప్రభుత్వ వనరులు క్యూబన్ల జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా ఇంధన ఆంక్షలు ఈ ద్వీప జనజీవనాన్ని దారుణంగా దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పర్యాటకరంగం తీవ్రంగా క్షీణించింది. రాజధాని నగరం హవానాలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రం వద్ద వందలాదిగా జనం బారులు తీరుతున్నారు. ఉదయాన్నే ఏడింటికి తలుపులు తెరిచే ఈ కేంద్రంలో పంపిణీ చేసే ఆహారం కోసం కొంతమంది ప్లాస్టిక్ బొచ్చెలతో రాత్రే అక్కడికి చేరుకొని రోడ్డు మీద పడుకొంటున్నారు. ''మేము చాలా గడ్డు రోజులు గడుపుతున్నాం'' అని ఈ కేంద్రానికి వచ్చిన రిటైర్డ్ సెక్యూరిటీ గార్డు ఫెర్నాండో ఫెర్నాండెజ్ (71) తెలిపారు. ''వీరు పంపిణీ చేసే ఆహారంతో నా బిడ్డలకు కనీసం ఒక్కపూటైనా కడుపు నిండుతుంది'' అని అయిదుగురు పిల్లల తల్లి మర్లీస్ పాన్స్ (34) చెప్పారు. క్యూబాలో అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న ఇటువంటి సామాజిక వంటశాలలే అభద్రతా భావంతో ఉన్న స్థానికులకు జీవనాధారంగా మారాయి. పలు ధార్మిక సంఘాలు, అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్య సమితి ఈ కేంద్రాల ద్వారా ప్రజల ఆకలిని తీరుస్తున్నాయి. ఈ కిచెన్లలో పెద్ద సైజు కడాయిలు పెట్టి అన్నం, గుడ్లు, పాస్తా.. అప్పుడప్పుడు కొద్దిపాటిగా చికెన్ వండుతున్నారు. బాటిళ్లలో చాక్లెట్ పాలను నింపుతున్నారు.

తిరుమల వేంకటేశుడికి రూపమిచ్చిన చిత్రకారుడు శ్రీనివాసన్ కన్నుమూత

- తమిళనాడులోని కోవిల్పట్టిలో వృద్ధాప్యంతో మృతి
- 1970లో టీటీడీ ఆహ్వానంతో గర్భగుడిలో స్వామిని చూసి చిత్రాలు గీసిన శ్రీనివాసన్
- ఆభరణాలతో, ఆభరణాలు లేకుండా రెండు రూపాల్లో చిత్రాలు
- ఇంటింటా పూజలందుకుంటున్న ఆయన చిత్రాలు



తిరుమల: ఇంటింటా పూజలందుకుంటున్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రానికి ప్రాణం పోసిన ప్రఖ్యాత చిత్రకారుడు ఎస్.ఎం. శ్రీనివాసన్ (86) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కోవిల్పట్టిలోని తన స్వగృహంలో గురువారం తుది శ్వాస విడిచారు. తమిళనాడుకు చెందిన శ్రీనివాసన్, పదో తరగతి వరకు చదివి ప్రముఖ చిత్రకారుడు కొండయ్య రాజు వద్ద చిత్రకళలో శిక్షణ పొందారు. ఆయన ప్రతిభను గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) 1970లో ప్రత్యేకంగా ఆయనను ఆహ్వానించింది. గర్భగుడిలోని మూలవిరాట్టును నేరుగా దర్శించి, స్వామివారి దివ్య రూపాన్ని ఆయన తన కుంచెతో చిత్రించారు. స్వామివారు సర్వాభరణాలతో అలంకరించుకున్న రూపం ఒకటి, ఆభరణాలు లేకుండా ఉన్న నిరాడంబర రూపం మరొకటి.. ఇలా రెండు రకాల అద్భుతమైన చిత్రాలను ఆయన గీశారు. ఈ చిత్రాలు అనతికాలంలోనే భక్తుల్లో అశేష ప్రాచుర్యం పొందాయి. నేడు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా దాదాపు ప్రతి ఇంట్లో, వ్యాపార సంస్థలో కనిపించే శ్రీవారి చిత్రం శ్రీనివాసన్ గీసిందే. వేంకటేశ్వరస్వామితో పాటు ఆయన పలు ఇతర హిందూ దేవతామూర్తుల చిత్రాలను కూడా గీసి మెప్పించారు. కోవిల్పట్టిలోని మండిత్తోప్పు రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో మరణవార్త తెలియగానే, పలువురు ప్రముఖులు, స్థానికులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. శ్రీవారి రూపానికి తన కుంచెతో శాశ్వతత్వాన్ని అందించిన శ్రీనివాసన్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం..

- ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 19 నుంచి 24 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. కుటుంబానికి జీవనాధారమైన ప్రధాన సంపాదనపరుడు అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోందని తెలిపారు.ఈ పథకం కింద కుటుంబంలోని ప్రధాన సంపాదనపరుడికి బీమా రక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు.18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని, వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని వివరించారు.భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ వార్డుల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ శిబిరాల్లో అర్హులైన కుటుంబాలను గుర్తించి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ నంబర్లు, బీమా పొందే ప్రధాన సభ్యుడి వివరాలు, నామినీ వివరాలతో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.నమోదు సమయంలో వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని, నామినీ మైనర్ అయితే వారి సంరక్షకుడి వివరాలను కూడా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సేకరించిన దరఖాస్తులను డిజిటల్ విధానంలో నమోదు చేసి, సంబంధిత బీమా సంస్థకు పంపించడంతో పాటు అసలు దరఖాస్తులను జిల్లా స్థాయిలో భద్రపరచనున్నట్లు తెలిపారు.బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో సంబంధిత అధికారుల ద్వారా వివరాలను నమోదు చేసి, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జిల్లా స్థాయి ఆమోదంతో బీమా సంస్థకు ప్రతిపాదనలు పంపిస్తారని కలెక్టర్ వివరించారు. అర్హత నిర్ధారణ పూర్తయిన తర్వాత రూ.5 లక్షల బీమా పరిహారాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేసేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ బీమా భద్రతపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కావున అర్హులైన కుటుంబాలు ఈ నెల 19న నిర్వహించే ప్రత్యేక నమోదు శిబిరాలకు అవసరమైన వివరాలతో హాజరై ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష శిక్షణ శిబిరం ముగింపు

(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) పరీక్ష పూర్తయ్యేంత వరకు ప్రతి క్షణం అత్యంత విలువైనదని, కష్టపడి చదివిన వారికి విజయం తథ్యమని, ప్రిలిమినరీ, ఫిజికల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఉచిత భోజనం, వసతితో తదుపరి శిక్షణ అందిస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక డీటీసీ ప్రాంగణంలో 60 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగిన ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణ శిబిరం నేటితో ముగిసింది. సెప్టెంబర్ 7వ తేదీన ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొని నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ పొందారు.శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష, డిసెంబర్ 20వ తేదీన కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్ష పూర్తయ్యే వరకు ప్రతి క్షణాన్ని ఎంతో విలువైనదిగా భావించి సమయాన్ని వృధా చేయకుండా చదవాలని సూచించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు సూచించిన విషయాలను పాటిస్తూ పూర్తిస్థాయిలో పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. కష్టపడి చదివిన వారికి విజయం తప్పకుండా వరిస్తుందని పేర్కొన్నారు.శిక్షణలో భాగంగా అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ స్టడీస్, ఇంగ్లీష్, ఇండియన్ హిస్టరీ, తెలంగాణ హిస్టరీ, తెలంగాణ ఉద్యమం, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర అంశాల్లో ఆదిలాబాద్, వరంగల్, హైదరాబాద్, నల్గొండ ప్రాంతాలకు చెందిన నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ అందించడంతో పాటు ఉచిత పార్యపుస్తకాలు కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని, గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలను రెండు మూడు సార్లు నెమరువేసుకుంటూ సబ్జెక్టుల వారీగా ప్రాధాన్యత కేటాయించి చదవాలని సూచించారు.అదేవిధంగా ప్రిలిమినరీ పరీక్షలు, శారీరక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు తదుపరి దశ శిక్షణను ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో అందించనున్నట్లు జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులు మాట్లాడుతూ మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన తమకు జిల్లా పోలీస్ శాఖ అందించిన ఉచిత శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉందని, జిల్లా ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ అందించిన అధ్యాపకులను జిల్లా ఎస్పీ శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్ స్పెక్టర్ కే. నాగరాజు, రిజర్వ్ ఇన్ స్పెక్టర్ డి. వెంకటి, శిక్షణ కేంద్రం సిబ్బంది, అధ్యాపకులు ప్రసాద్, వివేక్, ఫణీంద్ర, రమణ గౌడ్, అల్లం సాయి కృష్ణ, శంకర్, రమేష్, సమీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ హామీని గౌరవిస్తూ సమ్మె విరమిస్తున్నాం ...



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): కమిషనర్ ఇచ్చిన హామీని గౌరవిస్తూ, ప్రభుత్వంపై నమ్మకంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామని ఎన్ హెచ్ ఎం ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు.నిర్మల్ జిల్లాలో గత 33 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు తాత్కాలికంగా తెరపడింది. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఇచ్చిన లిఖితపూర్వక హామీ మేరకు ఉద్యోగులు సమ్మెను తాత్కాలికంగా విరమించాలని నిర్ణయించారు.పది ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి, మూడు నెలల్లో నివేదిక సమర్పిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.నేటి నుంచి తిరిగి విధుల్లో చేరి ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు వెల్లడించారు. నేటి నుంచి ఉద్యోగులందరూ తిరిగి విధుల్లో చేరి ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. కమిటీ నివేదిక వచ్చే వరకు తమ డిమాండ్ల పరిష్కారంపై అప్రమత్తంగా ఉంటామని స్పష్టం చేశారు.33 రోజుల సమ్మె కాలంలో తమకు సహకరించిన ప్రజలకు, పత్రికా ప్రతినిధులకు, వివిధ ఉద్యోగ, ప్రజా సంఘాలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, సమన్వయకర్త బొజ్జ రమణ, కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ రమేష్, యోత్స్నేనతో పాటు నాయకులు సుజాత, శోభ, నుస్రత్, రాధ, వెంకట రమణ, జైపాల్, వంశీ, భోజన్న, భువన, వినీత, గంగమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దేవ్‌గాలే విట్టల్ కుటుంబాన్ని పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



(బేల, సాక్షర): దేవ్‌గాలే విట్టల్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కుటుంబానికి తగిన అండగా ఉంటామని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు.మండలం దాహెగావ్ గ్రామానికి చెందిన దేవ్‌గాలే విట్టల్ మృతి చెందడంతో, వారి కుటుంబ సభ్యులను ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విట్టల్ కుమారులు అమూల్, గజానన్ లను ఓదార్చి, కుటుంబానికి తగిన అండగా ఉంటామని భరోసానిచ్చారు.వారి వెంట దాహెగావ్ సర్పంచ్ భోక్రే శంకర్, మాజీ జెడ్పీటీసి నక్లే రాందాస్, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ వాంఖడే, బేలా మండల అధ్యక్షులు రూప్రావ్ వాంఖడే, మాజీ ఎంపీపీ ఉల్కే బాపురావు, జైనథ్ సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలలే దేశ భవిష్యత్తు... వారి కలలను సాకారం చేసేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) బా లలే దేశ భవిష్యత్తు అని, వారి కలలను సాకారం చేసేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, ప్రతి చిన్నారిలోనూ అపారమైన ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉంటుందని, వాటిని వెలికితీసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు.ఆదిలాబాద్ పట్టణంలోని విజ్డమ్ - ది స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్, లక్ష్య కాకతీయ హైస్కూల్ లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ బాలల దినోత్సవం అనేది పిల్లల హక్కులు, వారి భవిష్యత్తు, విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేసే ప్రత్యేకమైన రోజని పేర్కొన్నారు. ప్రతి చిన్నారిలోనూ అపారమైన ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉంటాయని, వాటిని వెలికితీసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక బాధ్యతలపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఓటములకు భయపడకుండా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు హితవు పలికారు.నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని అన్నారు. విద్యార్థుల కలలకు సరైన దిశానిర్దేశం, ప్రోత్సాహం అందిస్తే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ వారికి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహం, ప్రతిభను అభినందించారు.

రోస్టర్ లో మాలలకు అన్యాయం : సత్యనారాయణ



- మాల చైతన్య గర్జనను విజయవంతం చేయాలి

(ఆదిలాబాద్, సాక్షర) తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల రూపొందించిన నూతన రోస్టర్ పాయింట్ల కేటాయింపులో అత్యంత వెనుకబడిన ర్యాంకు కలిగిన మాలలు, అనుబంధ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల చైతన్య గర్జన (ఎంసిజి) జిల్లా అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కుల సంఘాల జేఏసీ ఆదిలాబాద్ భవనం అధ్యక్షులుగా ఉన్న ఆయన మాట్లాడుతూ, ఇటీవల వెలువడిన నోటిఫికేషన్లలో గ్రూప్ - 3 కులాలకు కేవలం తక్కువ పాయింట్లు కేటాయించారని తెలిపారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రిజర్వేషన్ స్ఫూర్తికి భంగం కలిగిస్తోందని పేర్కొన్నారు. దీంతో ఈ కులాల విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారని అన్నారు.ఈ విషయాన్ని ప్రభుత్వం పునరాలోచించి రోస్టర్ కేటాయింపుల్లో సవరణలు చేసి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాలలకు 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలని కోరారు.మాల చైతన్య గర్జనను విజయవంతం చేయాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈనెల 15న ఆదిలాబాద్ లోని డబ్ల్యు - కన్వెన్షన్ హాల్ లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాల సామాజిక వర్గం, అనుబంధ కులాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలోమాల కో ఆర్డినేషన్ ఫోరం జిల్లా అధ్యక్షులు శశికాంత్ , రమేశ్, సత్యనారాయణ, మాల సంఘం జేఏసీ నాయకులు అల్లూరి భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



(ఆదిలాబాద్, సాక్షర): ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం ద్వారా పేదలకు నేత్ర వైద్య సేవలు అందిస్తున్న నిర్వాహకులు అడ్వకేట్ ఎం.ఏ. బషీర్ ను అభినందిస్తున్నామని, శిబిరంలో జరుగుతున్న వైద్య సేవలను పరిశీలించినట్లు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అడ్వకేట్ ఎం.ఏ. బషీర్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ లోని మసూద్ నగర్, ఉర్దూ ఘర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం కార్యక్రమానికి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు.మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతతో కలిసి శిబిరంలో జరుగుతున్న వైద్య సేవలను పరిశీలించి నిర్వాహకులు అడ్వకేట్ ఎం.ఏ. బషీర్ ను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఇమ్రాన్, అఫ్సర్, మందాకిని తదితర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు : సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి



(బోథ్, సాక్షర): ఒకపక్క ఎల్ నినో ప్రభావంతో మంచినీరు, కరెంటు సమస్యలు వచ్చే పరిస్థితుల్లో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్రమశిక్షణతో లేకుంటే సమస్యలు ఇంకా పెరుగుతాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. బోథ్ మండలం బాలాపూర్ గ్రామపంచాయతీ ప్రభుత్వ స్కూల్లో నిర్మించిన మంచినీటి ట్యాంకు శనివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత నుంచి దాదాపు రెండు గంటల పాటు నిండిపోయి కొన్ని వందల లీటర్ల నీరు వృథాగా పోయింది.ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు అప్రమత్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆ మోటార్ ను బంద్ చేయించి, సంబంధిత వారికి తెలియజేశారు.భవిష్యత్తులో ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి సంఘటన జరగకుండా చూడాలని, బాలాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిపై తగు చర్యలు తీసుకోవాలని ముడుపు ప్రభాకర్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వాట్సాప్ ద్వారా తెలియజేశారు.

నేటి బాలలే రేపటి పౌరులు : సర్పంచ్ గోవిందరావు పటేల్



(తానూర్, సాక్షర): బాలల హక్కులు, రక్షణ, సంక్షేమం, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తానూర్ మండలం వడగావ్ గ్రామ సర్పంచ్ గోవిందరావు పటేల్ అన్నారు.మండలంలోని వడగావ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ గోవిందరావు పటేల్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గ్రామ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాలల హక్కులు, రక్షణ, సంక్షేమం, విద్య ప్రాముఖ్యత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.గ్రామంలో మహిళలు, గ్రామ పెద్దలు, పిల్లలు ఈ గ్రామ సభలో పాల్గొన్నారు.

పత్రాలు వెంట ఉంచుకోవాలి : ఎస్సై శ్రీకాంత్



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, రహదారి భద్రతా నియమాలను పాటించాలని సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ సూచించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు సారంగాపూర్ మండల పరిధిలోని మలక్ చించోలి ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించామని సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.ఈ తనిఖీల సందర్భంగా సరైన వాహన పత్రాలు లేని 30 మంది వాహనదారులకు జరిమానాలు విధించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుందని హెచ్చరించారు. వాహనదారులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షిత ప్రయాణాన్ని కొనసాగించాలని ఎస్సై శ్రీకాంత్ తో పాటు పోలీసులు కోరారు.

రేవంత్ రెడ్డిని మార్చే వరకు నేను ఫైట్ చేస్తా

• కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ అధినేత

(హైదరాబాద్, సాక్షర): రేవంత్ రెడ్డి పెట్టిన భారత్ సమ్మిట్ నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. - ఈ సమ్మిట్ ప్రధాని మోదీకి వ్యతిరేకంగా, రాజకీయ లబ్ధి కోసం మాత్రమే పెట్టినట్టుగా నాకు అనిపిస్తోందని ప్రజా శాంతి పార్టీ అధినేత కే ఏ పాల్ వ్యాఖ్యానించారు. లేకపోతే.. నార్వేకి చెందిన ఒక రిపోర్టర్ ని ఈ సమ్మిట్ కి పిలవడం ఏంటని ప్రశ్నించారు. నేను అమెరికాలో అత్యంత శక్తివంతమైన నేత స్పీకర్ మైక్ జాన్సన్, ఎలాన్ మస్క్, మార్క్ జుకర్ బర్గ్ వంటి 25-30 మంది పెద్ద పెద్ద ప్రపంచ వ్యాపారవేత్తలను తీసుకొద్దామని అనుకున్నాను. పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చే వారిని రేవంత్ రెడ్డి ఎందుకు ఆపుతున్నారు? ఈ సమ్మిట్ అసలు ఎందుకోసం పెట్టారు? రేవంత్ రెడ్డిని నేరుగా అడుగుతున్నానని అన్నారు. గత ఎడాది వందల కోట్లు ఖర్చుపెట్టి ఒక సమ్మిట్ పెట్టారు. ఏమైనా ఉపయోగం ఉందా? లక్షల కోట్ల అప్పు పెరిగిపోయింది, రాష్ట్రం సర్వనాశనం అయిపోయింది. మోడీకి వ్యతిరేకంగా ఏదైనా చేయాలనుకుంటే ఢిల్లీకి వెళ్లి చేయండి. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే నాతో చేతులు కలపండి. రేవంత్ రాజకీయంగా పుట్టకముందే రాష్ట్రానికి బిల్ క్లింటన్, జార్జ్ బుష్, వారెన్ బఫెట్ సహా అనేకమంది అమెరికన్ బిగ్ షార్ట్స్ ని తీసుకొచ్చాను. రేవంత్ రెడ్డిలో మార్పు రావాలి. లేదా రేవంత్ రెడ్డిని మార్చే వరకు నేను ఫైట్ చేస్తానని అన్నారు.

జన్నారంలో మధుమేహానికి చెక్ పెట్టిన లయన్స్

• ఘనంగా ప్రపంచ మధుమేహ దినోత్సవం



(జన్నారం, సాక్షర) సమాజసేవలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, ప్రజలను ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకొని క్షేమంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు బండారు మరుతిరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత మధుమేహ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మధుమేహం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వస్తే తీసుకోవాల్సిన మందులు, ఆహారం, వ్యాయామం తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి పరీక్షలు చేశారు.ఈ సందర్భంగా మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు బండారు మరుతిరాజు మాట్లాడుతూ సమాజసేవలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని అన్నారు. ప్రజలను ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకొని క్షేమంగా ఉంచాలనే ఉద్దేశంతో శనివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్ పర్సన్ లయన్ జక్కు భూమేష్, జోన్ చైర్ పర్సన్ లయన్ మదంశెట్టి మల్లికార్జున్, సభ్యులు మల్యాల బాపన్న, వావిలాల రాజు, ప్రవీణ్ కుమార్, జాజాల శ్రీనివాస్, కస్తూరి సతిష్ కుమార్, సైన్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చదువే పేదరికానికి విరుగుడు : ఉపారపు సత్యరాజ్

• ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల సందర్శన



(ఇచ్చోడ, సాక్షర) పేదరికాన్ని జయించడానికి చక్కని మార్గం చదువొక్కటేనని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉపారపు సత్యరాజ్ ఆకాంక్షించారు. మండలంలోని మేడిగూడలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉపారపు సత్యరాజ్ శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి వంట గదిలోని కూరగాయలు, సరుకులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధనను అడిగి తెలుసుకున్నారు.పేదరికాన్ని జయించడానికి చక్కని మార్గం చదువొక్కటేనని, కాబట్టి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు సైతం ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్, బోధన సిబ్బంది తదితరులు ఉన్నారు.

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే.. మాజీ మంత్రి దానం

(హైదరాబాద్, సాక్షర): నేటి బాలలే రేపటి పౌరులని ఆనాటి దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అన్నారని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆయన రాజ్ భవన్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆయన సైకిలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా తాను అండగా నిలబడతానని అన్నారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

కేఆర్‌కే కాలనీ పాఠశాలలో చిన్నారుల సంబరం



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీయూపీఎస్ కేఆర్కే కాలనీ పాఠశాలలో చిన్నారుల నృత్యాలు, ఉపన్యాసాలు, పోటీలతో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా పిల్లల నృత్యాలు, ఉపన్యాసాలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.3 నెలల్లో 100 శాతం హాజరైన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. ఎస్ఏ-1 లో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నవీన్ యాదవ్, శ్రీకాంత్, శ్రీరామ్, మదన్, కిరణ్ కుమార్, కిషోర్ కుమార్, నీలమ్మ, సునీత, శృతి, శ్రావణి, సుకన్య, కల్పన, ట్రైనింగ్ టీచర్లు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా బాలల దినోత్సవం



(లక్ష్మణ్ చందా, సాక్షర): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో, దివ్యాంగుల మనోవికాసం పునరావాస సేవల కేంద్రంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు, విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో, దివ్యాంగుల మనోవికాసం పునరావాస సేవల కేంద్రంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆనందంగా ఆడుతూ పాడుతూ విద్యార్థులు బాలల దినోత్సవం జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి బాలల దినోత్సవం ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీబీవీలో ఎస్ఓ నవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, దివ్యాంగుల కేంద్రంలో సర్పంచ్ ఓస కవిత రాజు, ఐకెపి సిబ్బంది, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో వైద్య శిబిరం



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): తెలంగాణ ప్రభుత్వ గిరిజన రెసిడెన్షియల్ స్కూల్ లో వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు, 56 మంది విద్యార్థులకు ల్యాబ్ టెక్నీషియన్ రిహాజ్ రక్త పరీక్షలు నిర్వహించినట్లు హెల్త్ సూపర్ వైజర్ ఆడే సురేష్ తెలియజేశారు. కార్యక్రమంలో ఆడే సురేష్, ఆరోగ్య సహాయకులు నల్ల ఈశ్వర్ రెడ్డి, శ్రీవాణి ప్రేమ్ సింగ్, ఆశా కార్యకర్తలు రంగలక్ష్మి, సురేఖ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. 56 మంది విద్యార్థులకు ల్యాబ్ టెక్నీషియన్ రిహాజ్ రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలియజేశారు.

రీసర్వేను వేగంగా పూర్తి చేయండి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



• కూనీపూర్ లో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియ పరిశీలన

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.” వర్ని మండలం కూనీపూర్ గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే బృందాలు చేపడుతున్న కొలతల విధానం, సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన తదితర అంశాలను క్షుణ్ణంగా గమనించి, అధికారులకు సూచనలు చేశారు.ఈ ప్రక్రియకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేసే సమయంలోనే సమాంతరంగా ప్రభుత్వ భూముల సర్వేను సైతం చేపట్టి హద్దులను నిర్ణయించి పక్కాగా గుర్తులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫారెస్టు భూముల సర్వే ప్రక్రియను అటవీ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించాలని అన్నారు.తప్పిదాలకు తావులేకుండా వేగవంతంగా రీసర్వే జరిపిన సర్వేయర్లను ఎంపిక చేసి నగదు పారితోషికాలు అందజేస్తామని ప్రకటించారు. ఈ నెలాఖరు లోపు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించిన వారికి మొదటి బహుమతి కింద రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు, నాలుగు, ఐదవ స్థానంలో ఎంపికైన వారికి రూ.2 వేలు, వేయి రూపాయల నగదు పారితోషికం అందజేస్తామని అన్నారు.గడువు సమీపిస్తున్న దృష్ట్యా సెలవు దినాలలో సైతం రీసర్వే ప్రక్రియను కొనసాగించాలని, తాను కూడా క్షేత్రస్థాయి పరిశీలనలు జరుపుతానని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ యజమానులు, రైతులు కూడా భూ రీసర్వే ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని, ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వే పనుల్లో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తద్వారా భూ వివాదాలు సమసిపోయి, రైతులకు వారి భూములపై ఖచ్చితమైన హక్కుల నిర్ధారణ అవుతుందన్నారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాజాగౌడ్, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, వర్ని తహసీల్దార్ ప్రశాంత్, స్థానిక సర్పంచ్ లక్ష్మణ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

జనసేన తెలంగాణ వీరమహిళల ఆత్మీయ సమావేశం ప్రారంభం

• పార్టీ సంస్థాగత విస్తరణలో మహిళల భాగస్వామ్యంపై ముఖాముఖి చర్చ

హైదరాబాద్:జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర వీరమహిళల ఆత్మీయ సమావేశం మాదాపూర్‌లోని జూబ్లీ రిడ్జ్ వేదికగా ప్రారంభమైంది. జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు వీరమహిళలు సమావేశానికి తరలివచ్చారు. పార్టీ సంస్థాగత విస్తరణలో వీరమహిళల పాత్ర, నాయకత్వ బాధ్యతల్లో మహిళలకు ప్రాధాన్యం, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సమావేశంలో ముఖాముఖి చర్చిస్తున్నారు. వీరమహిళల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పార్టీ రాష్ట్ర నాయకత్వం భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోనుంది. పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచేలా దిశానిర్దేశం చేయనున్నారు.

బాలలే దేశ భవిష్యత్: సర్పంచ్ వాసాల నరేష్

• కిష్టాపూర్ లో బాలల గ్రామసభ



(జన్నారం, సాక్షర) బాలలే దేశ భవిష్యత్, వారి రక్షణ అందరి బాధ్యతని, గ్రామంలో బాలల హక్కులను కాపాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో బాలల గ్రామసభ నిర్వహించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ వాసాల నరేష్ అధ్యక్షతన ప్రత్యేక బాలల గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సభలో బాలల హక్కులు, రక్షణ, సంక్షేమం, విద్య ప్రాముఖ్యత, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ గ్రామంలో బాలల హక్కులను కాపాడుతూ, బాలల విషయంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ఏ మాత్రం జరగకుండా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. బాలలే దేశ భవిష్యత్, వారి రక్షణ అందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ నయిమొద్దిన్, వార్డు సభ్యులు, అంగన్ వాడీ ఉపాధ్యాయులు, కార్యకర్తలు, గ్రామ యువకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమమే మా లక్ష్యం - రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్



(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం మంచిర్యాలలోని టీపీయూఎస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు బగ్గని రవికుమార్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్ పాల్గొని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా ప్రసంగించారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఈ క్రింది డిమాండ్లు చేశారు.ఉపాధ్యాయుల ప్రయోజనాల దృష్ట్యా జీవో నెం. 190ను అమలు చేయాలి.కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.పెండింగ్ లో ఉన్న కరువు భత్యాలను వెంటనే విడుదల చేసి, పీఆర్సీని మంజూరు చేయాలి.పేద విద్యార్థుల విద్యాహక్కును కాపాడేందుకు, ప్రాథమిక పాఠశాలల మనుగడ కోసం జీవో నెం. 25ను సవరించాలని, బోధనకు ఆటంకంగా మారుతున్న ఆన్ లైన్ రిపోర్టింగ్, అనవసరపు ట్రైనింగ్ లను తగ్గించి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి.ఉపాధ్యాయులు తమ సమయాన్ని పూర్తిగా బోధనకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఈ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బండి రమేష్, ఎస్. శ్రీనివాసరావు, ఐ. విద్యాసాగర్, జిల్లా నాయకులు చీర సమ్మయ్య, నీలేష్, శ్రీనివాస్ తో పాటు జిల్లా, మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఐక్యంగా, నిరంతరం పోరాడాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించారు.

ప్రకృతి సేద్యం... సూపర్....

• ఒకే ఊరు.. ఒకే రకం.. కానీ ఫలితం వేరు!

(ఏలూరు, సాక్షర): ప్రకృతి వైపరీత్యాల ముందు మనిషి నిస్సహాయుడు అంటారు. కానీ, ప్రకృతిని నమ్ముకుని వ్యవసాయం చేసిన రైతుల పంటలు మాత్రం తుఫానుల ధాటికి సైతం తట్టుకుని నిలబడ్డాయి. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాను వణికించిన వరుస తుఫానుల అనంతరం పక్కపక్కనే ఉన్న పొలాల్లో కనిపించిన దృశ్యాలు ఇప్పుడు వ్యవసాయ రంగంలో ఆసక్తికర చర్చకు దారితీశాయి.అక్టోబర్ 27, 28 తేదీల్లో విరుచుకుపడిన ఆర్నబ& తుఫాను, ఆ వెంటనే నవంబర్ 2, 3 తేదీల్లో ముంచెత్తిన మురసు తుఫాను పశ్చిమగోదావరి జిల్లా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాలులు, భారీ వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. అయితే, ఈ పెను విపత్తులోనూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పొలాలు మాత్రం ఆశ్చర్యకరంగా తట్టుకుని నిలబడ్డాయి.జిల్లాలోని పలు గ్రామాల్లో పక్కపక్కనే ఉన్న రసాయన, ప్రకృతి వ్యవసాయ పొలాలను పరిశీలిస్తే స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది. పాలకొల్లు మండలం అరట్లకట్టలో గత ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు ముప్పిడి ఆశీర్వాదం తన ఎకరం పొలంలో 'MTU 1318' రకం వరిని సాగు చేశారు. అతను ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ , జీవామృతం, ఘనజీవామృతం వంటి పద్ధతులను పాటించడం వల్ల తుఫాను ధాటికి ఆయన పొలంలో 80 శాతం పంట నేలకొరగకుండా నిలబడింది. అయితే, పక్కనే అదే రకం వరిని రసాయన పద్ధతిలో సాగు చేసిన కొనప రాజు రాంబాబు పొలంలోని పంట పూర్తిగా నేలకొరిగింది.మొగల్తూరు మండలంలోని మొగల్తూరులోనూ ఇదే పరిస్థితి కనిపించింది. కుక్కల నాగరాజు అనే రైతు ప్రకృతి ఎరువులతో సాగు చేసిన సంపత్ స్వర్ణ వరి పంట తుఫాను గాలులను తట్టుకుని 50 శాతం మేర నిలబడింది. కానీ, పక్కనే అదే రకాన్ని రసాయన ఎరువులతో సాగు చేసిన చెన్ను శ్రీను పంట పూర్తిగా నేలకొరిగింది. అలాగే పెంటపాడు మండలం బి. కొండేపాడు గ్రామానికి చెందిన పాలా సాయిపద్మ ప్రకృతి ఎరువులతో సాగు చేసిన పంటలో 50 శాతం సురక్షితంగా నిలబడింది. అదే సమయంలో పొరుగున ఉన్న పాల దత్తుడు అనే రైతు రసాయన ఎరువులతో సాగు చేసిన పంట మొత్తం నేలమట్టమైంది.అత్తిలి మండలం ఒరిగేడు గ్రామంలోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. గింజ గట్టిపడే దశలో ఉన్న 'సంపత్ స్వర్ణ' వరి పంట ప్రకృతి వ్యవసాయం చేసిన రైతు జేనుల విజయదుర్గ పొలంలో 50 శాతం మేర నిలబడింది. అయితే, అదే గ్రామంలో రసాయన పద్ధతుల్లో సాగు చేసిన గున సత్యనారాయణ పంట పూర్తిగా దెబ్బతింది. ప్రకృతి వ్యవసాయం ఎలా కాపాడింది? రసాయన ఎరువులు వేసిన పంటలు పైకి ఏపుగా పెరిగినా.. వాటి కాండం బలహీనంగా ఉండటంతో బలమైన గాలులకు త్వరగా నేలకొరిగే అవకాశం ఉంటుంది. కానీ, ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే జీవామృతం, ఘనజీవామృతం, బయో కల్చర్స్ వంటి వాటి వల్ల నేలలో సూక్ష్మజీవుల వృద్ధికి తోడ్పాటు లభిస్తుంది. దీంతో పంట వేర్లు భూమిలోకి బలంగా చొచ్చుకుపోయి, కాండం కూడా దృఢంగా మారుతుందని చెబుతున్నారు. ఫలితంగా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులను సైతం కొన్ని ప్రకృతి వ్యవసాయ పంటలు తట్టుకుని నిలబడ్డాయి.వాతావరణ మార్పులు, అకాల వర్షాలు రైతులను నిత్యం అందోళనకు గురిచేస్తున్న ప్రస్తుత తరుణంలో.. పశ్చిమగోదావరి రైతుల అనుభవాలు వ్యవసాయ రంగంలో కొత్త చర్చకు తెరతీస్తున్నాయి. తక్కువ పెట్టుబడి, ఆరోగ్యకరమైన నేలతో పాటు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించడంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎలా ఉపయోగపడతాయో ఈ క్షేత్రస్థాయి అనుభవాలు తెలియజేస్తున్నాయి.

నర్సాపూర్ - జి లో రూ.1.57 కోట్ల అభివృద్ధి జాతర

• ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం, శంకుస్థాపనలు



(నిర్మల్ ప్రతినిధి/ నర్సాపూర్, సాక్షర) నర్సాపూర్ - జి మండల అభివృద్ధికి రూ.1.57 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు, మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఇటువంటి భవనాలు, మౌలిక సదుపాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని బీజేపీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా నర్సాపూర్ - జి మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు నూతన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.మండలంలోని రాంపూర్ గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్యకు సంబంధించిన నాలుగు భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా రూ.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు గోదాములకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని గ్రామ అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, మహిళల ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై చర్చించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఇటువంటి భవనాలు, మౌలిక సదుపాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అనంతరం నర్సాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56.85 లక్షల వ్యయంతో నిర్మించనున్న బాలికల విద్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాల్లో నిలిచిన కావేరి (ఎంపీసీ), కీర్తన (బైపీసీ) విద్యార్థినులను శాలువాలతో సత్కరించి అభినందించారు.నర్సాపూర్ మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లకు సంబంధించిన ఉత్తర్వు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో రాంపూర్ గ్రామ సర్పంచ్ చిన్నోళ్ల విజయలక్ష్మి ప్రవీణ్, ఉప సర్పంచ్ కమ్రుద్దీన్, నర్సాపూర్ స్థానిక సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు, బిజెపి మండల అధ్యక్షుడు నరేందర్, బిజెపి నాయకులు ఠాకూర్ అర్జున్, మహిపాల్, రమణ రెడ్డి, ముత్యం రెడ్డి, జమాల్, సత్యం చంద్రకాంత్, అనిల్, గోవర్ధన్, శ్రీనివాస్, ప్రణీత్ తదితరులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయం 10 నుంచి 5 గంటల వరకే 50 వేల మందికి మించకూడదు



ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో నిర్వహించే నిరసనలు, బహిరంగ సభలను నియంత్రించేందుకు పోలీసులు కొత్త ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనల ప్రకారం.. నిరసనలు ఏడు గంటలకు మించకూడదు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు, నిరసనకారులపై కూడా పరిమితి విధించారు. 50 వేల కంటే ఎక్కువ మంది నిరసనల్లో పాల్గొనడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. వేదిక వద్ద భద్రత, రక్షణ ఏర్పాట్ల కోసం ఏకరీతి విధానాన్ని ఏర్పాటుచేయడానికి ఈ స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ తీసుకొచ్చారు. ఇది ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉందని, ఆమోదం కోసం ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపారని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఈ నిబంధనలు ఇంకా ఖరారు కావాల్సి ఉంది.అక్టోబరు 11న జంతర్ మంతర్‌ను ఢిల్లీ పోలీసులు నిరసనల వేదికగా రద్దుచేసి, దీనికి ప్రత్యామ్నాయంగా రామ్‌లీలా మైదానం, బురారీ, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్స్‌ను ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తాజా మార్గదర్శకాలు తెరపైకి వచ్చాయి. కేంద్ర హోంశాఖ ప్రత్యేక కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మూడు వేదికలకు సంబంధించి సమగ్రమైన విధివిధానాలను జారీచేస్తామని పోలీసులు అప్పట్లో తెలిపారు.పోలీసుల అనుమతి కోసం నిర్వాహకులు దరఖాస్తు చేసుకునే ముందు, మైదానం అందుబాటులో ఉందని ధ్రువీకరిస్తూ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి క్లియరెన్స్ పొందాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతిపాదిత కార్యక్రమానికి కనీసం 10 రోజుల ముందు దరఖాస్తులను సమర్పించాలి. సభను నిర్వహించడం, ట్రాఫిక్ అధికారులతో సమన్వయం చేసుకోవడం నిర్వాహకులదే బాధ్యత. వారు పార్కింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు, పాల్గొనేవారిని దింపే ప్రదేశాలను గుర్తించాలి. రహదారులు, అత్యవసర మార్గాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలి.మైదానంలోకి తుపాకులు, కత్తులు, బల్లేలు, పదునైన వస్తువులు, ఇతర ప్రమాదకర వస్తువులను తీసుకురావడం పూర్తిగా నిషేధం. మైదానం పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌లను ఎగురవేయడానికి కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి. నిర్వాహకులు తాగునీరు, వైద్య సహాయం, పారిశుధ్య సౌకర్యాలను కల్పించడంతో పాటు, వ్యర్థాలను సరిగ్గా తొలగించే ఏర్పాట్లు కూడా చేయాల్సి ఉంటుంది.

ఆధునిక నిర్మాణానికి పునాదులు వేసిన మహానేత జవహర్ లాల్ నెహ్రూ - గండ్రత్ సుజాత

• కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణానికి దిశానిర్దేశం చేసిన దార్శనిక నాయకుడని, ఎన్నో సవాళ్లతో స్వాతంత్ర్యం పొందిన భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన పటిష్టమైన పునాదులు వేశారని మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో భారతరత్న, భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ లోని విజయ డైరీ పక్కన ఉన్న విజ్ఞాన్ స్పెషల్ స్కూల్ ను సందర్శించి, అక్కడి చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గండ్రత్ సుజాత మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణానికి దిశానిర్దేశం చేసిన దార్శనిక నాయకుడని కొనియాడారు. ఎన్నో సవాళ్లతో స్వాతంత్ర్యం పొందిన భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన పటిష్టమైన పునాదులు వేశారని తెలిపారు.దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి శ్రీకారం చుట్టి, 1950లో ప్రణాళికా సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగం, విద్యుత్, ఉక్కు, భారీ పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ దేశ ఆర్థిక స్వావలంబనకు కృషి చేశారని వివరించారు.అదేవిధంగా ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వైద్య పరిశోధన రంగాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిచ్చారని, ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా, వైద్య సంస్థల ఏర్పాటుకు ఆయన నాయకత్వంలోని ప్రభుత్వం ప్రోత్సాహం అందించిందని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పరిశోధనా సంస్థలు, జాతీయ ప్రయోగశాలల అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం, లౌకికవాదం, సామాజిక సమానత్వం, మహిళల హక్కులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి నెహ్రూ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేటి ఆధునిక భారతదేశ అభివృద్ధిలో ఆయన వేసిన పునాదులు ఎంతో కీలకమైనవని అన్నారు.ముఖ్యంగా పిల్లలే దేశ భవిష్యత్తు అని విశ్వసించిన నెహ్రూకు చిన్నారులంటే ఎంతో ప్రేమ అని, ఆయన జన్మదినమైన నవంబర్ 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు కల్పించినప్పుడే బలమైన భారతదేశాన్ని నిర్మించగలమని అన్నారు.ఈ సందర్భంగా విజ్ఞాన్ స్పెషల్ స్కూల్ లోని చిన్నారులతో బాలల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రేమ, ప్రోత్సాహం, విద్య అందించి వారి భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని గండ్రత్ సుజాత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజర్ పాషా, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ, జిల్లా కాంగ్రెస్ ఆఫీస్ ఇన్ చార్జి గౌలి సంజీవ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ మీర్జా ఇమ్రాన్ బేగ్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దేవిదాస్ చారి, మావాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీలు అక్తర్ అలీ, మందకిని, ఇంటక్ జిల్లా అధ్యక్షులు మునిగేలా నర్సింగ్, సేవాదళ్ ఆఫ్సర్, పట్టణ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, వార్డ్ ప్రెసిడెంట్ లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిల్లలు క్రమశిక్షణతో ఉంటే అన్నీ సాధించవచ్చు... పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ బూమేష్



(జన్నారం, సాక్షర) ప్రతి ఒక్క విద్యార్థి చిన్ననాటి నుండే మంచి క్రమశిక్షణతో ఉంటే విద్యలో, క్రీడలలో, సమాజ సేవలకు సంబంధించిన అన్ని రంగాలలో మంచి ఫలితాలు సాధించవచ్చని, ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యం కొరకు ఎన్నో ఏర్పాట్లు చేస్తున్నదని, దానిని అందరూ సద్వినియోగం చేసుకొని తమ ఊరికి, తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ బూమేష్ అన్నారు.పోనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత పోనకల్ లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పిల్లలతో పిల్లల స్నేహ గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, మంచి ఆరోగ్య అలవాట్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యత అంశాలను వివరించారు. విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు, వారి ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ - ఏఐక్స్ ఎల్ కంప్యూటర్ ల్యాబును ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఆవిష్కరించారు.ఈ గ్రామసభకు అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చిన్ననాటి నుండే మంచి క్రమశిక్షణతో ఉంటే విద్యలో, క్రీడలలో, సమాజ సేవలకు సంబంధించిన అన్ని రంగాలలో మంచి ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు. ప్రభుత్వం సైతం విద్యార్థుల సౌకర్యం కొరకు ఎన్నో ఏర్పాట్లు చేస్తున్నదని, దానిని అందరూ సద్వినియోగం చేసుకొని మీరు పుట్టి పెరిగిన ఊరికి, కనిపెంచిన తల్లిదండ్రులకు, క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పిన గురువులకు, పాఠశాలకు మంచి పేరు, గుర్తింపులు తేవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పోనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఉప సర్పంచ్ అప్పాల జలపతి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎన్. విజయకుమార్, చైర్ పర్సన్ మూల రేణుక, వార్డు సభ్యులు అంజన్న, మొసీన్, సుగుణ, సంతోష్, మహేందర్, పాఠశాల ఉపాధ్యాయులు కే. రాజేశం, కే. శ్రీకాంత్, బిల్ కలెక్టర్ అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

• తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ డిమాండ్

(హైదరాబాద్, సాక్షర): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ముదిరాజ్ సామాజిక వర్గం ముఖ్య పాత్ర పోషించిందని వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాచ్చరం చేయడం ఎంత మాత్రం సబబు కాదని తెలంగాణ మన ముదిరాజ్ సభ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు సోమాజిగూడ,ప్రెస్ క్లబ్ లో సత్తయ్య ముదిరాజ్, పండుగ బాలు ముదిరాజ్, ఎర్రబోయిన ఉష,నీలం శ్వేత బాలు,తదితర ముదిరాజ్ నాయకులు పాల్గొని మాట్లాడారు.తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ ఆవిర్భవించి 12 సంవత్సరాలు గడుస్తున్నందున 21వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ముదిరాజులందరూ ముదిరాజ్ జెండా ఎగరవేసి ఐక్యత చాటాలని అన్నారు.ఇప్పటికే మన ముదిరాజ్ మహాసభ అనేక పోరాటాలు చేసి విజయాలు దక్కించుకుందని అన్నారు. రాబోవు రోజులలో ప్రభుత్వం ముదిరాజుల కు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ముదిరాజ్ డిమాండ్లు అయినా అనేక అంశాలను ప్రజాక్షేత్రంలో ఉంచి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

38 ఏళ్ల బాల్య స్నేహబంధానికి అపూర్వ గౌరవం

• దుర్గం శేఖర్ కు బాల్య మిత్రుల ఘన సత్కారం



(ఆదిలాబాద్, సాక్షర) "హోదాలు మారవచ్చు, పదవులు మారవచ్చు, కానీ 38 ఏళ్ల బాల్య స్నేహబంధం మాత్రం ఎప్పటికీ మారదని, అదే నిజమైన స్నేహానికి చిరునామా అని, నేటి సమాజంలో స్నేహాలు డబ్బు, హోదా, స్థాయిని బట్టి మారుతున్న తరుణంలో చిన్ననాట ఏర్పడిన తమ స్నేహబంధం నేటికీ అదే ఆప్యాయత, అనురాగం, ఆత్మీయతతో కొనసాగడం ఎంతో ఆనందంగా ఉందని బాల్య మిత్రులు అన్నారు.ఇటీవల ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్ మెంట్ ఇన్ చార్జిగా నియమితులైన దుర్గం శేఖర్ ను ఆయన బాల్య మిత్రులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిఠాయి తినిపించి, పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా బాల్య మిత్రులు మాట్లాడుతూ నేటి సమాజంలో చాలావరకు స్నేహాలు డబ్బు, హోదా, స్థాయిని బట్టి మారుతున్న తరుణంలో, సుమారు 38 ఏళ్ల క్రితం చిన్ననాట ఏర్పడిన తమ స్నేహబంధం నేటికీ అదే ఆప్యాయత, అనురాగం, ఆత్మీయతతో కొనసాగడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.రాజకీయంగా, సామాజికంగా దుర్గం శేఖర్ ఎన్ని ఉన్నత స్థాయిలకు ఎదిగినా, బాల్య మిత్రుల పట్ల ఆయన చూపించే ప్రేమాభిమానాలు, తమ మధ్య ఉన్న అనుబంధం ఏమాత్రం తగ్గలేదని తెలిపారు.చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, జీవితంలో ఎన్ని మార్పులు వచ్చినా స్నేహానికి మాత్రం ఎలాంటి మార్పు ఉండకూడదని, కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలబడటమే నిజమైన స్నేహానికి అసలైన నిదర్శనమని భావోద్వేగంగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా దుర్గం శేఖర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని బాల్య మిత్రులందరూ మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు నరేందర్ బాబు, పవన్ టీచర్, నాగరాజ్, వ్యాపారవేత్త శ్రీనివాస్ తదితర బాల్య మిత్రులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం : ఎమ్మెల్యే పాయల్ శంకర్

• గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి ఆదిలాబాద్‌లో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



(ఆదిలాబాద్, సాక్షర) ఆదిలాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పాయల్ శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లెపూల నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ ఎస్ చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఏఐ, డిజిటల్ మాధ్యమాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ పుస్తక పఠనం ద్వారా లభించే విజ్ఞానం, ఏకాగ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయంలో మరిన్ని ఏసీలు ఏర్పాటు చేస్తామని, ఇతర మండలాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. జీపీఓ, డీఎస్సీ పోస్టుల భర్తీ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ చిత్రు మాట్లాడుతూ, గ్రంథాలయంలో కల్పించిన ఆధునిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష మాట్లాడుతూ, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఏకాగ్రత పెరుగుతాయని, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు.చైర్మన్ డాక్టర్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ, జిల్లాలోని గ్రంథాలయాలను ఆధునిక విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, 12 మండల గ్రంథాలయాల పునరుద్ధరణతో పాటు ఏసీలు, కూలర్లు, ఫర్నిచర్ ఏర్పాటు చేశామని తెలిపారు.జిల్లాలో ఒక కేంద్ర గ్రంథాలయం, 12 శాఖా గ్రంథాలయాలు, 13 పౌర పఠన మందిరాల ద్వారా సేవలు అందిస్తున్నామని, 1,36,680 పుస్తకాలు, 16,581 మంది సభ్యులు ఉన్నారని కార్యదర్శి వివరించారు.ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, కవి సమ్మేళనం, రంగోలి పోటీలు నిర్వహించనున్నారు. నవంబర్ 20న ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు ప్రకాష్, శ్రీకాంత్, భండారి పోచన్న, జోగు రవి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు తగినట్లు ఓవర్ బర్డెన్ ను తొలగించాలి

• కొత్తగూడెం రీజియన్ లోని నాలుగు ఏరియాల ఓవర్ బర్డెన్



(హైదరాబాద్, సాక్షర): సింగరేణి మొత్తం మీద అత్యధిక బొగ్గును ఉత్పత్తి చేస్తున్న కొత్తగూడెం రీజియన్ (కొత్తగూడెం ఏరియా, సత్తుపల్లి ఏరియా, ఇల్లందు ఏరియా, మణుగూరు ఏరియా) లో లక్ష్యాలకు తగిన విధంగా ఓవర్ బర్డెన్ తొలగించాలని, దీనికి అనుగుణంగా ఏజెన్సీలవారు తగిన సంఖ్యలో యంత్రాలను, మానవ వనరులను సమకూర్చుకోవాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. శనివారం ఉదయం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన కొత్తగూడెం రీజియన్ లోని పలు ఓపెన్ కాస్ట్ గనుల బొగ్గు ఉత్పత్తి, అందుకు అనుగుణంగా సాగుతున్న ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు రవాణా, తదితర అంశాలపై ఆయా ఏరియాల జీఎంలు, ఓబీ తొలగింపు ఏజెన్సీల ప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో సింగరేణి సంస్థ ప్రతీ రోజు తెలంగాణ జెన్ కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 75 వేల టన్నుల బొగ్గును సరఫరా చేయాల్సి ఉంటుందని, అదే సమయంలో సింగరేణితో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న విద్యుత్ కేంద్రాల అవసరాలకు బొగ్గును రవాణా చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి సాధించాలంటే ఓవర్ బర్డెన్ తొలగింపు నిర్దేశిత లక్ష్యాల మేర జరగాలని స్పష్టం చేశారు. ప్రతీ రోజు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఓవర్ బర్డెన్ తొలగిస్తేనే దాని కింద ఉన్న బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం అన్ని ఏరియాలు కలిపి రోజుకు 14.15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ లక్ష్యాలను సాధించాలని, వీటిలో కొత్తగూడెం రీజియన్ కు సంబంధించిన నాలుగు ఏరియాలు రోజుకు 5.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను ప్రతీ రోజు తొలగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓబీ లక్ష్యాల సాధనకు గల ఇబ్బందులు ఏమన్నా ఉంటే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఓవర్ బర్డెన్ తొలగింపులలో అలసత్వం చూపే ఏజెన్సీల పట్ల యాజమాన్యం ఉదాసీనంగా ఉండబోదని స్పష్టం చేశారు. కొత్తగూడెం రీజియన్ లోని నాలుగు ఏరియాల గనులలో సాగుతున్న బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు రవాణా, తదితర అంశాల పైన అధికారులు వివరించగా ప్రతీ అంశాన్ని ఛైర్మన్ కూలంకషంగా చర్చించి ఆదేశాలు జారీ చేశారు. కొత్తగూడెం ఏరియా నుంచి రోజుకు 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 0.55 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు జరగాలని స్పష్టం చేశారు. సత్తుపల్లి ఏరియాలో రోజుకు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని, ఇందుకోసం రోజుకు 2.4 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలన్నారు. మణుగూరు ఏరియాలో రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని, ఈ లక్ష్యాల సాధన కోసం రోజుకు 2.25 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఇల్లందు ఏరియాలో రోజుకు 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, 10 వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని స్పష్టం చేశారు. భద్రతతో కూడిన బొగ్గు ఉత్పత్తి, నాణ్యతతో కూడిన బొగ్గు రవాణాకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వచ్చే కొద్ది నెలల్లో కాంట్రాక్టు కాలపరిమితి ముగియనున్న గనులకు సంబంధించిన అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఆయా గనుల కోసం కొత్త కాంట్రాక్టు ప్రతిపాదనలను త్వరితగతిన రూపొందించి, అవసరమైన అనుమతులు పొందాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆన్ లైన్ కానీ పింఛన్ దరఖాస్తుదారులకు శుభవార్త



• శ్రీహరిరావు చొరవతో వారికి ఆన్ లైన్ అవకాశం

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) నిర్మల్ జిల్లాలో ఇలా ఎంతమంది ఉన్నా వారందరి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయిస్తామని, వారిలో అర్హులైన వారందరికీ వచ్చే నెల నుండి పింఛన్ అందిస్తామని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్ చార్జి కూచాడి శ్రీహరిరావు అన్నారు. పింఛన్ కోసం దరఖాస్తు ఆన్ లైన్ కానీ వారికి మంచి అవకాశమని, పింఛన్ రాదని నిరాశ చెందిన వారికి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్ చార్జి కూచాడి శ్రీహరిరావు చొరవతో కొత్త పింఛన్లు రానున్నాయి.ఈ విషయమై హైదరాబాద్ లో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ను వారు కలిశారు. నిర్మల్ జిల్లాలో సుమారు 200 మంది అర్హులైన వారి దరఖాస్తులు ఆన్ లైన్ లో నమోదు కాలేదని సీఈవోకు తెలిపారు. ఈ కారణంగా అర్హులైన వారు ప్రభుత్వ పింఛన్ కోల్పోయే ప్రమాదముందని చెప్పారు. వారికి మరో అవకాశం కల్పించి వారి దరఖాస్తులను ఆన్ లైన్ చేయించి పింఛన్లు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.వెంటనే స్పందించిన సీఈవో జిల్లాలో ఇలా ఎంతమంది ఉన్నా వారందరి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయిస్తామని, వారిలో అర్హులైన వారందరికీ వచ్చే నెల నుండి పింఛన్ అందిస్తామని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ హామీ ఇచ్చినట్లు శ్రీహరిరావు తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

• రూ.47,000 నగదు, 6 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం పేకాట, జూదానికి పాల్పడితే చర్యలు: జైనథ్ సీఐ జి శ్రావణ్

(బేల, సాక్షర) బహిరంగ ప్రదేశాల్లో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జైనథ్ సీఐ జి శ్రావణ్ తెలిపారు.బేల పోలీస్ స్టేషన్ పరిధిలోని బేల గ్రామం పుసం కాంప్లెక్స్ సమీపంలో బహిరంగ ప్రదేశంలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మధ్యాహ్నం 3:45 గంటల సమయంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా పుసం కాంప్లెక్స్ సమీపంలో ఐదుగురు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతుండగా పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు అహ్మద్ధాక్రే మనీష్ కుమార్, సంజయ్ జిద్దేవర్వారి వద్ద నుండి రూ.47,000 నగదు, 6 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది. ఈ దాడిలో బేల ఎస్ఐ వై మధుకృష్ణ డార్నే మనీష్, అ గార్కర్ అజయ్షేక్, పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి..

• లేనిపోని హామీలతో ఆశలు చూపించి ఆటో కార్మికులను మోసం చేయొద్దు టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అమలు చేయకుండా కొత్త కొత్త హామీలతో ఆటో కార్మికులను ఆశలకు గురి చేసి ఆగం చేయడం సరైన పద్ధతి కాదని ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా టీయూసీఐ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు ఆటో కాలనీ, సంక్షేమ బోర్డు, ఆర్థిక సహాయం, ప్రమాద బీమా, ఇతర సంక్షేమ పథకాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం విడుదల చేసే జీవోలు ఆటో కార్మికులందరికీ ఉపయోగపడే విధంగా ఉండాలి తప్ప కొంతమందికే పరిమితమయ్యే విధంగా ఉండకూడదన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మాటలతో కాలయాపన చేయకుండా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులను ఐక్యం చేసి హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

వాహనదారులు అన్ని డాక్యుమెంట్స్ కలిగి ఉండాలి : ఎస్సై శ్రావణి



(లక్ష్మణ చందా, సాక్షర): వాహనదారులు ప్రతి ఒక్కరూ డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లక్ష్మణ చందా ఎస్సై శ్రావణి అన్నారు. శనివారం మండలంలోని కనకాపూర్ ప్రధాన కూడలి వద్ద ఎస్సై శ్రావణి నాకబంది నిర్వహించారు.ఈ సందర్భంగా అన్ని పత్రాలు ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని, మద్యం సేవించి నడపరాదని సూచించారు.ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాపి రెడ్డికి ఘన నివాళి...

• పరామర్శించిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి



జైనథ్, సాక్షర :

మండలంలోని సాంగి కే గ్రామంలో దీపావళి రోజు 86 ఏళ్ల వయసులో మరణించిన నిమ్మల బాపి రెడ్డికి ప్రముఖులు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి బాపి రెడ్డి కుమారుడు, ప్రముఖ న్యాయవాది నిమ్మల ప్రతాప్ రెడ్డిని పరామర్శించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గత చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అమెరికాలో ఉంటున్న బాపి రెడ్డి తమ్ముడిని కూడా పలకరించారు. కార్యక్రమంలో పొద్దుకూరు నారాయణ రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, రెడ్డి సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది ఓం ప్రకాష్ రెడ్డి, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఇతర ప్రముఖులు నిమ్మల బాపి రెడ్డికి ఘన నివాళులర్పించి, నిమ్మల ప్రతాప్ రెడ్డిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అరెస్టులతో ప్రజాభిప్రాయాన్ని అణిచివేయలేరు - బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్



(చెన్నూర్, సాక్షర) అరెస్టులతో, గృహ నిర్బంధాలతో ప్రజాభిప్రాయాన్ని అణిచివేయలేరని, గత సంవత్సరం 27 కోట్లు వెచ్చించి నిర్వహించిన భారత్ సమ్మిట్ కార్యక్రమం ద్వారా ఎవరికి ప్రయోజనం చేకూరిందో రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ అన్నారు. హైదరాబాద్ లో జరుగుతున్న భారత్ సమ్మిట్ కు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ఆ కార్యక్రమంలో హాజరు కాకుండా చెన్నూరు సీఐ బన్సీలాల్ నేతృత్వంలో పోలీసుల బృందం ఆయనను గృహ నిర్బంధంలో ఉంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 27 కోట్లు వెచ్చించి నిర్వహించిన భారత్ సమ్మిట్ కార్యక్రమం ద్వారా ఎవరికి ప్రయోజనం చేకూరిందో రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించే 40 ఇస్లామిక్ దేశాల ప్రతినిధులను, కమ్యూనిజం పేరుతో నియంతృత్వాన్ని ప్రోత్సహించే ఇతర దేశాల ప్రతినిధులను, జార్జ్ సోరేష్ లాంటి వ్యక్తులను, ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలలో అలజడులు, గొడవలు ప్రేరేపించే ప్రోగ్రెసివ్ అలయన్స్, ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థలను ఈ సమ్మిట్ లో భాగస్వామ్యం చేయడం రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తుందని అన్నారు. ప్రోగ్రెసివ్ అలయన్స్ సంస్థలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ శాశ్వత సభ్యులుగా ఉండటం గమనార్హమని ఆయన అన్నారు.ఈ సంస్థల ప్రేరణతో నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక లాంటి దేశాలలో అలజడులు ప్రేరేపించి ప్రజాస్వామ్యాన్ని కూలదోసి నియంతృత్వాన్ని అధికారంలోకి తెచ్చిన కీలక సంస్థలని, వీటి సహకారంతో దేశంలో 2029 లోపు అలజడులు సృష్టించి స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, వీటిని ముమ్మాటికి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు సాగనివ్వబోరని ఆయన హెచ్చరించారు. సందర్భంగా ఆయనకు జిల్లా అధికార ప్రతినిధి గర్రెపల్లి వెంకట నరసయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కాగిత వెంకటేష్, మాణిక రైతు శంకర్, చెన్నూరు రూరల్ అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్, నాయకులు వెంకట్, సాటారి వెంకటేష్ సంఘీభావం ప్రకటించారు.

అభివృద్ధి అంటే ఆకాశహర్మ్యాలేనా?

మనిషి బతుకు బాగుపడినప్పుడే నిజమైన ప్రగతి.. పాలకులు ఆలోచించాల్సిన సమయం! ఒక ఊరిలో ఎత్తైన భవనాలు నిర్మించవచ్చు. విశాలమైన రహదారులు వేయవచ్చు. రంగురంగుల విద్యుత్ దీపాలతో పట్టణాలను అలంకరించవచ్చు. ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావచ్చు. ఇవన్నీ అభివృద్ధికి చిహ్నాలే. కానీ ఈ వెలుగుల వెనుక సామాన్యుడి జీవితంలో చీకట్లు తొలగకపోతే ఆ అభివృద్ధికి అర్థమేమిటి? నిజమైన అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు కాదు.. మనిషి జీవన ప్రమాణాల్లో వచ్చే మార్పు. పేదవాడికి నాణ్యమైన విద్య అందాలి. సామాన్యుడికి అందుబాటులో వైద్యం ఉండాలి. రైతుకు గిట్టుబాటు ధర లభించాలి. యువతకు ఉపాధి అవకాశాలు కలగాలి. మహిళలకు భద్రత, గౌరవం దక్కాలి. వృద్ధులకు భరోసా ఉండాలి. ఇవే అభివృద్ధికి అసలైన కొలమానాలు. నేటి సమాజంలో అభివృద్ధి గురించి మాట్లాడుతున్నప్పుడు ప్రకటనలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఇస్తున్న ప్రాధాన్యతకు తగ్గట్టుగా ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి కనీస అవసరాలు ఇంకా అనేక ప్రాంతాల్లో సమస్యలుగానే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందినప్పుడే సామాన్య కుటుంబానికి నిజమైన ఊరట లభిస్తుంది. మరోవైపు ప్రకృతి వనరుల సంరక్షణను కూడా అభివృద్ధిలో భాగంగా చూడాలి. చెరువులు కబ్జాలకు గురైతే, కాలువలు పూడికతో నిండిపోతే, చెట్లు కనుమరుగైతే,



భూగర్భ జలాలు అడుగంటితే భవిష్యత్తు తరాలకు మనం అందించేది ఏమిటి? అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయడం ప్రగతి కాదు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ ముందుకు సాగడమే బాధ్యతాయుతమైన అభివృద్ధి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల పనితీరును అంచనా వేయాల్సింది ప్రచారంతో కాదు.. ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులతో. పథకాల సంఖ్యతో కాదు.. అవి అర్హులైన ప్రజలకు ఎంతవరకు చేరాయన్న దానితో. బడ్జెట్ కేటాయింపులతో కాదు.. వాటి ఫలితాలతో. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో స్పందించినప్పుడే పాలనకు సార్థకత చేకూరుతుంది.ఇక్కడ పౌరుల బాధ్యతను కూడా విస్మరించలేం. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఎంత ముఖ్యమో, ప్రజా ఆస్తులను కాపాడటం, పన్నులు చెల్లించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, సామాజిక బాధ్యతతో వ్యవహరించడం కూడా అంతే ముఖ్యం. హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించినప్పుడే సమాజం ఆరోగ్యకరంగా ముందుకు సాగుతుంది. దేశం ఎంత ఎత్తుకు ఎదిగిందన్నది ఆకాశాన్ని తాకే భవనాలతో కొలవకూడదు. అట్టడుగు మనిషి జీవితం ఎంత మెరుగుపడిందన్నదే అభివృద్ధికి అసలైన అద్దం. ఆకలితో ఉన్నవాడికి అన్నం, అనారోగ్యంతో ఉన్నవాడికి వైద్యం, చదువుకోవాలనుకునే పేదబిడ్డకు విద్య, కష్టపడే రైతుకు గౌరవం, యువతకు ఉపాధి కల్పించగలిగినప్పుడే అభివృద్ధి లక్ష్యం నెరవేరుతుంది.ఎందుకంటే.. అభివృద్ధి అంటే భవనాల ఎత్తు పెరగడం కాదు.. సామాన్యుడి బతుకు స్థాయి పెరగడం! -



వ్యాసకర్త: ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
-9440287170

తీన్మార్ మల్లన్నపై హత్యాయత్నం ప్రజాస్వామ్యంపై దాడి

- బీసీల రాజ్యాధికార ఉద్యమాన్ని అడ్డుకోవడం ఎవరి తరం కాదు : మహేష్ వర్మ



(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) బీసీల రాజకీయ రాజ్యాధికారం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్రను అడ్డుకోవాలనే కుట్రలో భాగంగానే ఆయన ప్రయాణిస్తున్న కారును లారీతో ఢీకొట్టిన ఘటన జరిగిందనే అనుమానాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, బీసీల రాజ్యాధికార ఉద్యమాన్ని అడ్డుకోవడం ఎవరి తరం కాదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ అన్నారు.మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి విగ్రహం ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర 51వ రోజు అనాస్ పూర్ - మోత్కూరు నుంచి తిరుమలగిరి వైపు కొనసాగుతున్న సమయంలో అనాస్ పూర్ సమీపంలో అతివేగంగా వచ్చిన లారీ మల్లన్న ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రమాద సమయంలో మల్లన్న కారులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, ఆయన ప్రయాణిస్తున్న కారు పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడగా, ఎదురుగా వస్తున్న మరో కారులో ప్రయాణిస్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో ఒక మహిళ చికిత్స పొందుతూ మృతిచెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉండటం కలచివేస్తోందని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతిచెందిన మహిళ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.బీసీల గొంతుకను అణచివేయాలని చూస్తే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అన్నారు.బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ వాటా, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో సాగుతున్న రాజ్యాధికార యాత్రను భయపెట్టి ఆపాలని చూడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ తమ హక్కుల కోసం ప్రశ్నించే, పోరాడే హక్కు ఉందని, అలాంటి ఉద్యమాలపై దాడులు, బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.గతంలో బెల్లి లలిత, మారోజు వీరన్న, సాంబశివుడు వంటి ఉద్యమకారుల హత్యలు తెలంగాణ సమాజాన్ని ఎంతగానో కలచివేశాయని గుర్తుచేశారు. ఉద్యమకారుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.తీన్మార్ మల్లన్న ఒక వ్యక్తి మాత్రమే కాదని, బీసీల ఆత్మగౌరవం, రాజకీయ వాటా, రాజ్యాధికారం కోసం పోరాడుతున్న ఒక ఉద్యమ స్వరమని అన్నారు. ఆ స్వరాన్ని అణచివేయడం ఎవరి తరం కాదని హెచ్చరించారు. బీసీ, బహుజన సమాజం తమ హక్కుల కోసం సంఘటితమవుతున్న తరుణంలో రాజకీయ ఆధిపత్యాన్ని కాపాడుకోవాలనే స్వార్థంతో ఎవరైనా కుట్రలకు పాల్పడితే ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తగిన సమాధానం చెబుతారని అన్నారు.51 రోజులుగా కొనసాగుతున్న బీసీ రాజ్యాధికార యాత్రకు రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతోందని, ఈ ఉద్యమం ద్వారా బీసీలు తమ హక్కులు, వాటా, అధికారంపై చైతన్యం పొందుతున్నారని తెలిపారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేశారు.90 శాతానికి పైగా ఉన్న బహుజన సమాజం ఇక భయపడదని అన్నారు. అగ్రవర్ణ రాజకీయ ఆధిపత్యానికి వ్యతిరేకంగా బీసీ, బహుజన వర్గాలు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్ని ఎవరూ అడ్డుకోలేరని, బెదిరింపులకు భయపడి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మహేష్ వర్మ స్పష్టం చేశారు. బీసీల రాజ్యాధికార లక్ష్యం సాధించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.ఈ ప్రమాద ఘటనపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు వెల్లడించాలని, ఘటన వెనుక కుట్ర కోణం ఉన్నట్లయితే దానిని వెలికితీసి, బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తీన్మార్ మల్లన్నతో పాటు బీసీ రాజ్యాధికార యాత్రలో పాల్గొంటున్న నాయకులకు తక్షణమే పటిష్టమైన పోలీసు భద్రత కల్పించాలని, ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మృతిచెందిన కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి, అన్ని విధాలా అండగా నిలవాలని డిమాండ్ చేశారు.బీసీల రాజ్యాధికార ఉద్యమం తరతరాలుగా రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడిన బహుజన వర్గాలకు న్యాయమైన వాటా, సమాన అవకాశాలు కల్పించాలనే ప్రజాస్వామ్య పోరాటమని, ఈ ఉద్యమాన్ని ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆపలేరని, బీసీల రాజ్యాధికారం సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూకు ఘన నివాళి



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): భారతదేశ ఆధునిక నిర్మాణానికి పునాదులు వేసిన మహానేత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని ఏఐసీసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో భారతరత్న, భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి కలిసి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ లోని విజయ డైరీ పక్కన ఉన్న విజ్ఞాన్ స్పెషల్ స్కూల్ ను సందర్శించి, అక్కడి చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేసి, వారితో కొంత సమయం ఆనందంగా గడిపారు.దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి శ్రీకారం చుట్టి, వ్యవసాయం,

బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు



(ఆదిలాబాద్ రూరల్, సాక్షర) పాఠశాలలో మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నిందితుడు గెడం లచ్చు అలియాస్ లక్ష్మణ్ (50) కొంతకాలంగా పాఠశాలలోని మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, ద్వందార్థాలు వచ్చే మాటలతో వేధించడం, అసభ్య పదజాలం ఉపయోగించడం, బాలికల పట్ల అసభ్యంగా తాకడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు షీ టీమ్ దృష్టికి ఫిర్యాదు అందింది. అంతేకాకుండా తనతో మాట్లాడకపోతే వారి గురించి ఇతరుల వద్ద చెడుగా ప్రచారం చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ రూరల్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గెడం లచ్చు అలియాస్ లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.మైనర్ బాలికలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూపీలో ఒవైసీ కూటమి

(లక్నో, సాక్షర): యూపీ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, ఆ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ కాన్షీరాం అధ్యక్షుడు, నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ అధికారికంగా రాజకీయ పొత్తును ప్రకటించారు. లక్నో వేదికగా నవంబర్ 12న వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశం నిర్వహించి యూపీలో కొత్తగా సామాజిక పరివర్తన మోర్చా పేరిట మూడో కూటమికి తెరలేపారు. ఇండియా కూటమిలో తమకు స్థానం కల్పించాలంటూ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లకు ఒవైసీ ఇచ్చిన గడువు ముగియడం, అఖిలేష్ యాదవ్ మొండిచేయి చూపడంతో.. ఒవైసీ నేరుగా చంద్రశేఖర్ ఆజాద్‌తో జట్టుకట్టి యూపీలో ఃదళిత-ముస్లింః కాంబినేషన్‌ను సెట్ చేశారు.యూపీ రాజకీయాల్లో దశాబ్దాల పాటు దళిత ఓటుబ్యాంకుకు ఏకైక అధినేత్రిగా వెలుగొందిన బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రభావం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో బలహీనపడటంతో, ఆ రాజకీయ శూన్యతను నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ వేగంగా భర్తీ చేస్తున్నారు. ముఖ్యంగా యువ దళిత ఓటర్లలో ఆజాద్‌కు పెరుగుతున్న ఆదరణను గుర్తించిన ఒవైసీ.. రాష్ట్రంలోని దాదాపు 40 శాతం వరకు ఉన్న ముస్లిం మైనారిటీ ఓట్లను, దళిత ఓట్లను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ఈ వ్యూహాత్మక పొత్తు కుదుర్చుకున్నారు. బలహీనవర్గాలు, యువత, రైతుల హక్కుల కోసం తమ కూటమి పోరాడుతుందని ఇరువురు నేతలు స్పష్టం చేస్తూనే, ఇప్పటివరకు దళితులు, ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకున్న ప్రధాన పార్టీలకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కొత్త కూటమి ఆవిర్భావం ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఏ స్థాయి ప్రభావం చూపిస్తుందన్నది ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారింది. రాష్ట్రంలోని 403 అసెంబ్లీ స్థానాల్లో పశ్చిమ యూపీ, రోహిల్‌ఖండ్, పూర్వాంచల్ ప్రాంతాల్లోని సంభల్, రాంపూర్, మీరట్, నగీనా, ఆజంగఢ్, బహ్రాయిచ్, శ్రావస్తి, కుందర్కి వంటి సుమారు 150 స్థానాల్లో ఈ కూటమి పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం 5 మున్సిపల్ ఛైర్మన్ పీఠాలు, 83 కౌన్సిలర్ స్థానాలను గెలుచుకోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో చంద్రశేఖర్ ఆజాద్ సత్తా చాటడం వీరి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గత 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇరు పార్టీలూ ఖాతా తెరవకపోయినప్పటికీ, ఈసారి కలిసి బరిలోకి దిగడం ద్వారా సమీకరణాలను మార్చాలని చూస్తున్నాయి. ఒకవేళ సామాజిక పరివర్తన మోర్చా గణనీయమైన స్థాయిలో దళిత, ముస్లిం ఓట్లను చీల్చగలిగితే.. అది నేరుగా అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమి ఫార్ములా విజయవకాశాలకు భారీ గండికొట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న 40-45 నియోజకవర్గాల్లో ఒవైసీ పార్టీ అభ్యర్థులు చీల్చే ఓట్లు అఖిలేష్ యాదవ్‌కు పెద్ద తలనొప్పిగా మారనున్నాయి. అదే సమయంలో బీఎస్పీ ఒంటరి పోరుకు సిద్ధమవుతుండటంతో దళిత ఓటుబ్యాంకు మాయావతి, చంద్రశేఖర్ ఆజాద్ మరియు ఎస్పీల మధ్య చీలిపోయే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.మొత్తానికి, మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి ఒకవైపు, దాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్న ఃఇండియాः కూటమికి మరోవైపు.. ఒవైసీ-ఆజాద్ జోడీ ఇప్పుడు అతిపెద్ద సవాలుగా నిలిచింది. మాయావతి నిస్తేజంతో విసిగిపోయిన దళితులు, అఖిలేష్ యాదవ్ వైఖరిపై అసంతృప్తితో ఉన్న ముస్లిం వర్గాలు ఈ కొత్త వేదిక వైపు ఆకర్షితులైతే యూపీ ఎన్నికల ఫలితాలు తలకిందులయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ కొత్త కూటమి కేవలం ప్రతిపక్ష ఓట్లను చీల్చే శక్తిగానే మిగిలిపోయి బీజేపీకి పరోక్షంగా లాభం చేకూరుస్తుందా, లేక బీహార్ తరహాలో యూపీ రాజకీయాల్లోనూ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా అవతరిస్తుందా అనేది రాబోయే 2027 ఎన్నికల రణరంగంలో తేలనుంది.

నిర్మల్ లో ఘనంగా గురుశ్రేష్ఠ అవార్డుల ప్రదానం



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి పునాదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని నిర్మల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ అప్పాల కావ్య, వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు.నిర్మల్ పట్టణంలో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ట్రస్మా నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో ఆర్.కె. ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన గురుశ్రేష్ఠ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ అప్పాల కావ్య, మున్సిపల్ వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని అన్నారు. విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను బోధిస్తూ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని కొనియాడారు.విద్యారంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గురుశ్రేష్ఠ అవార్డులతో సత్కరించడం ప్రశంసనీయమని తెలిపారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ విద్యారంగ అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్పీ రాజు, కత్తి నరేందర్, మాజీ కౌన్సిలర్ తోట నర్సయ్య, ట్రస్మా జిల్లా ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యారంగ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కంటి వెలుగు : మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్

- ఎం.ఏ. బాసీర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమైనదని, పేదలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మసూద్ నగర్ లో గల ఉర్దూ ఘర్ ఫంక్షన్ హాల్ లో ఎం.ఏ. బాసీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన వైద్య సేవలను పరిశీలించి, నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమైనదని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.ముఖ్యంగా పేద, నిరుపేద కుటుంబాలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు అందించడంతో పాటు స్పెక్టకిల్ లెన్స్ ఫిట్టింగ్ వంటి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో మంచి విషయమని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటంతో పాటు కంటి ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఎం.ఏ. బాసీర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, రిమ్స్ వైద్యులు డాక్టర్ ఇద్రిస్ అక్బని, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్లు, శిబిరాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ఎం.ఏ. బాసీర్ బృందం, వైద్య బృందానికి మున్సిపల్ చైర్ పర్సన్ ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దిల్ రాజు రిలీజ్ చేసిన 'జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమా సాంగ్



నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ లో దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో రిలీజ్ చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. తాజాగా ఈ మూవీ నుంచి మరో ఎమోషనల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ చిత్రంలోని 'నా కనుపాపే' అంటూ సాగే ఎమోషనల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. సాంగ్ విడుదల చేసిన అనంతరం దిల్ రాజు చిత్రయూనిట్‌కి ఆల్ ది బెస్ట్ తెలిపారు. ప్రవీణ్ బొలిశెట్టి ఇచ్చిన బాణీ, సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మోహిత్ కులకర్ణి సంగీతం, చిన్మయి శ్రీపాద గాత్రం అందరినీ హత్తుకునేలా ఉంది. పిల్లలు, తల్లిదండ్రుల మధ్య ఉండాల్సిన బంధాన్ని ఎంతో చక్కగా ఈ పాటలో వివరించారు. పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ ఇలా అందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రం. పిల్లలు, విద్యార్థుల్లో చూడాల్సింది మార్కులు కాదు.. వారి మనసులు అనే గొప్ప సందేశాన్ని ఇచ్చేలా ఈ సినిమాని రూపొందించారు. అందరిలోనూ స్ఫూర్తినింపేలా ఈ మూవీని తెరకెక్కించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ సినిమాని నవంబర్ 14న భారీ ఎత్తున విడుదల చేయనున్నారు. నటీనటులు* : మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి.

బాలకృష్ణ 'దాదా ధమాకా'తో మ్యూజికల్ హీట్




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా' షూటింగ్ దాదాపు పూర్తయింది. బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. గతంలో 'వీరసింహారెడ్డి'తో మంచి విజయాన్ని అందుకున్న బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'దాదా'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, పోస్టర్లు ఆ అంచనాలను మరింత పెంచాయి. ఇప్పుడు బాలకృష్ణ 'దాదా ధమాకా'తో మ్యూజికల్ హీట్ పెంచారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. పబ్ బ్యాక్‌డ్రాప్‌లో బాలకృష్ణ, బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫక్రీ కలిసి కనిపించిన ఈ పాట ఫుల్ ఎనర్జీతో సాగుతూ ఆకట్టుకుంటోంది. బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేనితో మంచి మ్యూజికల్ జర్నీని కొనసాగిస్తున్న తమన్ ఈ పాటకు అదిరిపోయే మ్యూజిక్ అందించారు. ఇన్ఫెక్షియస్ బీట్స్, క్యాచీ రిథమ్స్‌తో పాటను ఫుల్ ఎనర్జిటిక్ డ్యాన్స్ నంబర్‌గా రూపొందించారు. పాటలోని పార్టీ మూడ్‌కు తమన్ సంగీతం అద్భుతంగా కుదిరింది. నర్గీస్ ఫక్రీ గ్లామర్, బాలకృష్ణ తనదైన ఎనర్జీతో డ్యాన్స్ ఫ్లోర్‌పై సందడి చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన లిరిక్స్ పాటకు సరదా టచ్‌ను తీసుకొచ్చాయి. బాలకృష్ణ మౌనంగా ఉండటంపై నర్గీస్ తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, పాట పాడుతూ డ్యాన్స్‌లో పాల్గొనాలని ఆయన్ని ప్రోత్సహించేలా సాహిత్యం సాగుతుంది. రజిని శ్రీ పూర్ణిమ తన వాయిస్‌తో పాటను మరింత ఆకట్టుకునేలా చేశారు. బాలకృష్ణ కూడా ఈ పాటలో కొంత భాగాన్ని స్వయంగా పాడటం మరో ప్రత్యేకత. పాట విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. శేఖర్ వీజే మాస్టర్ ఈ పాటకు స్టైలిష్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా కొరియోగ్రఫీ అందించారు. సన్‌గ్లాసెస్, సిగార్‌తో బాలకృష్ణ ఫుల్ పార్టీ అవతార్‌లో కనిపించగా, నర్గీస్ ఫక్రీ తన గ్లామరస్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. వీరిద్దరి ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్, కెమిస్ట్రీ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. బాలకృష్ణ వాయిస్, స్టైలిష్ మూవ్స్, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ పాటకు మరింత మాస్ అప్పీల్ తీసుకొచ్చాయి. మరోవైపు నర్గీస్ తన గ్లామర్, గ్రేస్‌తో పాటను విజువల్ ట్రీట్‌గా మార్చారు. టైటిల్‌కు తగ్గట్టుగానే 'దాదా ధమాకా' ఫుల్ ఎనర్జీతో సాగుతూ మాస్ ఆడియన్స్‌కు ఫేవరెట్ సాంగ్‌గా నిలిచేలా ఉంది. ఈ సినిమాలో మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. రామ్-లక్ష్మణ్, రవి వర్మ, వీవెంకట్ యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య 'దాదా' డిసెంబర్ 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. 'దాదా ధమాకా' పాటతో మేకర్స్ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ఫుల్ ఎనర్జీతో ప్రారంభించారు. నటీనటులు:నందమూరి బాలకృష్ణ, మంచు మనోజ్, కాజల్ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ

పాజిటివ్ టాక్ తో ఇట్లు అర్జున

(హైదరాబాద్, సాక్షర): 'ఈ నగరానికి కొత్త పోరడొచ్చినాడే...' అంటూ ఓ కొత్త హీరో (అనీష్)కి చాలా ఎలివేషన్లు ఇచ్చిన సినిమా... 'ఇట్లు అర్జున'. దర్శకుడు వెంకీ కుడుముల ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించడం, నాగార్జున లాంటి అగ్ర హీరో... సమర్పకుడిగా మారడం, దాంతో పాటుగా ఈ సినిమా ప్రమోషన్ బాధ్యత తన నెత్తి మీద వేసుకోవడం, రామ్ చరణ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు హాజరవ్వడం, ఎన్టీఆర్ లాంటి స్టార్ కూడా.. ప్రమోషన్లో భాగం పంచుకోవడం వల్ల మెల్లమెల్లగా హైప్, క్రేజ్ పెరుగుతూ వచ్చింది. ఓ కొత్త హీరో డెబ్యూ సినిమాకు ఈ స్థాయిలో ఖర్చు పెట్టడం, ప్రచారం చేయడం కూడా ఈమధ్య కాలంలో ఇదే తొలిసారి. ఆదర్శ కుటుంబం ఎఫెక్టుతో పలుమార్లు విడుదల తేదీ వాయిదా పడడం వల్ల కూడా ఈ సినిమా వార్తల్లో నిలిచింది. ఇన్ని రకాలుగా.. అందరి నోళ్లలో నానిన ఇట్లు అర్జున ఎలా ఉంది? కొత్త పోరడు ఎలా ఉన్నాడు, బాక్సాఫీసు దగ్గర... ఈ సినిమా ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతోంది?పెద్దన్న (ముఖేష్ రుషి)కి సంబంధించిన వెయి కోట్లు హవాలా రూపంలో చేతులు మారే సమయంలో... ఓ హెల్మెట్ కుర్రాడు వచ్చి.. ఆ ప్లాన్ మొత్తం గంగ పాలు చేస్తాడు. ఒక పెన్ డ్రైవ్.. ఓ చిన్న పుస్తకంలో ఈ వెయ్యి కోట్ల హవాలాకు సంబంధించిన సమాచారం మొత్తం నిక్షిప్తమై ఉంటుంది. ఆ రెండింటి కోసం, తమకు అడ్డొచ్చిన ఆ హెల్మెట్ కుర్రాడి కోసం పెద్దన్న మనుషులు తీవ్ర స్థాయిలో గాలిస్తుంటారు. మరోవైపు హైదరాబాద్ లో...అర్జున్ (అనీష్) కథ నడుస్తుంటుంది. తనకు మాటలు రావు. కానీ తెలివైనోడు. చిన్నప్పటి నుంచీ తనపై దొంగ అనే ముద్ర బలంగా పడిపోయి ఉంటుంది. తండ్రితో కలిసి చిన్నప్పుడు కొన్ని దొంగతనాలు కూడా చేశాడు. ఓ దొంగతనం చేస్తూ.. ఇద్దరూ పట్టుబడిపోతారు. దాంతో చిన్నప్పుడే అర్జున్ జైలు పాలవుతాడు. తనకో ప్రేమ కథ కూడా ఉంటుంది. కీర్తి (అనస్వర రాజన్) అంటే.. ప్రాణం. తన మనసులోని మాట ఎలాగైనా సరే తనతో చెప్పాలనుకొంటాడు. కనీసం ఒక్క షేక్ హ్యాండ్ ఇచ్చి, తనను ఒక్కసారైనా దగ్గర్నుండి చూడాలని, కొన్ని మాటలు మాట్లాడాలని కలలు కంటుంటాడు. ఇవేం పట్టని కీర్తి పదిహేను రోజుల్లో అమెరికా వెళ్లేందుకు సన్నాహాలు చేసుకొంటుంటుంది. ఈ పదిహేను రోజుల్లో తన ప్రేమని ఎలాగైనా సరే.. కీర్తికి చెప్పాలనుకొంటాడు అర్జున్. ఈలోగా... వెయ్యి కోట్ల హవాలా వ్యవహారంలో కీర్తి, అర్జున్ ఇద్దరూ అనుకోకుండా పాత్రధారులైపోతారు. అదెలా జరిగింది? అసలు ఆ వెయ్యి కోట్ల గొడవేమిటి? అర్జున్ తన మనసులోని మాట కీర్తికి చెప్పగలిగాడా, లేదా? అనేదే మిగిలిన కథ. ఓ కొత్త హీరోని పరిచయం చేస్తున్నప్పుడు దాదాపుగా అతనిలో ఉన్న బలాల్ని ఫోకస్ చేస్తూ కథ రాసుకొంటారు. అయితే ఇట్లు అర్జున దగ్గరకు వచ్చేసరికి.. ఓ కథ రాసుకొని, అందులో కొత్త హీరోని తీసుకెళ్లారు. ఓరకంగా ఇది మంచి విషయమే. తొలి సినిమాకే మాటలు రాని మూగవాడిగా నటించడం అంటే మామూలు విషయం కాదు. హీరో మూగవాడవ్వడం... హీరోకి ఎంత వరకూ ప్లస్సయ్యిందో తెలీదు కానీ, ఓ మామూలు కథకు కొత్తదనం అబ్బేట్టు చేసింది. వెయ్యి కోట్ల హవాలా.. అందులో హీరో తనకు తెలీయకుండా ఇన్వాల్వ్ అవ్వడం, ఓ మూఠా.. హీరోని ఛేజ్ చేయడం అనేది కొత్త కథేం కాదు. కానీ... హీరోని మూగవాడిగా చేయడం వల్ల ఫ్లేవర్ మారింది. తొలి సీన్‌లోనే వెయ్యి కోట్ల వ్యవహారం తెరపైకి తీసుకొచ్చి... ప్రేక్షకుల్ని కథలో లీనమయ్యేట్టు చేశాడు. హీరోని దొంగగా పరిచయడం చేయడం, ఏ కేసు వచ్చినా.. పోలీసులు తనని కార్నర్ చేయడం, హీరోయిన్ ప్రేమ కోసం హీరో పడిగాపులు కాయడం.. ఇలాంటి సీన్లతో టైమ్ పాస్‌కి ఢోకా లేకుండా ఫస్టాఫ్ సాగిపోతుంటుంది. వెయ్యి కోట్ల మేటర్ వచ్చినప్పుడల్లా.. కథనం పరుగులు పెడుతుంది. ఫస్టాఫ్ ని ఓ మంచి బ్యాంగ్ తో ముగించాడు దర్శకుడు. మధ్యమధ్యలో చిన్న చిన్న ఫన్ మూమెంట్స్ బాగా వర్కవుట్ అయ్యాయి. వెన్నెల కిషోర్ పాత్ర అంత కామెడీ పండించకపోయినా అక్కడక్కడ నవ్విస్తుంది. హీరోయిన్ పాత్రని కూడా లైమ్లీగా రాసుకోవడం వల్ల... ఫస్టాఫ్ లో పెద్దగా కంప్లైంట్స్ ఉండవు. పైగా తొలి సినిమాలోనే హీరోని జగదేకవీరుడు లా చూపించకుండా, అనవసరమైన బిల్డప్పులు ఇవ్వకుండా కథకు లోబడి ఆ పాత్రని తీర్చిదిద్దడం వల్ల.. కనెక్ట్ అవుతాం. ఫస్టాఫ్ ముగిసే సరికి సినిమాపై మంచి అభిప్రాయమే కలుగుతుంది.సెకండాఫ్ కథ వెయ్యి కోట్ల చుట్టూ తిరుగుతుంది. కొన్ని ట్విస్టులు ఓకే అనిపిస్తాయి. అయితే.. ముఖేష్ రుషి తాలుకూ ఎపిసోడ్ మరీ ఓల్డ్ పేట్రన్ లో సాగుతుంది. ముఖేష్ రుషి డెన్‌లోకి హీరో వెళ్లి.. తిరిగి రావడం అనే సీక్వెన్స్ ఇంకొంచెం తెలివితేటలతో రాసుకొని ఉంటే బాగుండేది. విజిల్ తో సెల్ ఫోన్ ప్యాట్రన్ ని బ్రేక్ చేసే ఐడియా బాగా కుదిరింది. ఇలాంటి సీన్లే.. దర్శకుడి తాలుకూ క్రియేటీవ్ నెస్ ని బయటకు తీసుకొస్తాయి. ఇవి మరిన్ని పండాల్సింది. ఎందుకంటే హీరోని బాగా తెలివైనవాడిగా చూపిస్తూ వచ్చారు. అలాంటప్పుడు ఆ మైండ్ గేమ్ పైనే కథని ఎక్కువగా రన్ చేయాల్సింది. అవవసరమైన ట్రాకులు లేకుండా, పాటలు అడ్డు పడకుండా మంచి పని చేశాడు దర్శకుడు. సినిమా ఫ్లోని దెబ్బ తీయకుండా అవి కాపాడాయి. క్లైమాక్స్ లో వెయ్యి కోట్ల ఏమయ్యాయి అనేది అసంపూర్ణంగా వదిలేశాడు. దానికి కూడా జస్టిఫై చేసి ఉంటే బాగుండేది.తొలి అడుగులోనే మూగవాడి పాత్ర పోషించడం అంత తేలికైన విషయం కాదు. ప్రతీ సారీ.. బెబ్బెబ్బే... అంటే రెండో సీన్ కే బోర్ కొట్టే ప్రమాదం ఉంది. అయితే.. అనీష్ చాలా ఈజీగా ఈ ఛాలెంజ్‌ని స్వీకరించినట్టు అనిపించింది. అర్జున్ పాత్రకు త్వరగానే కనెక్ట్ అవుతాం. అర్జున్ మూగవాడు అనే విషయం త్వరగా మర్చిపోయేలా చేయగలిగాడు. డాన్సులు, ఫైట్లూ చాలా ఈజ్ తో చేశాడు. మంచి కథలు ఎంచుకొంటే తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోగలడు. అనస్వర పాత్ర హుషారుగా ఉంది. చలాకీగా చేసింది. వెన్నెల కిషోర్ అక్కడక్కడ నవ్వించాడు. కొన్ని డైలాగులు తాను మాత్రమే చెప్పగలడు అనిపించేలా రాసుకొన్నారు. ముఖేష్ రుషి లాంటి ఓల్డ్ విలన్ ని ఎంచుకోవడం మైనస్ కావొచ్చు కానీ, ఆ పాత్రని ఎక్కువగా లైమ్ లైట్ లోకి తీసుకురాకుండా హైడ్ చేయడం కలిసొచ్చింది.తమన్ ఈ సినిమాకు అసలైన హీరో. పాటలు ఆల్రెడీ హిట్టయ్యాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లో మ్యాజిక్ చేశాడు. చాలా సీన్లు తన ఆర్.ఆర్ తో ఎలివేట్ అయ్యాయి. ట్రెండీ మ్యూజిక్ ఇచ్చాడు. ఫొటోగ్రఫీ, ఆర్ట్, ప్రొడక్షన్ డిజైనింగ్ అన్నీ బాగా కుదిరాయి. వెంకీ కుడుముల కు నిర్మాత గా ఇది తొలి సినిమా. ఒక దర్శకుడు నిర్మాత గా మారడం కొత్తేమి కాదు. కానీ తాను డల్ స్టేజ్ లో వున్నాడు. ఇలాంటి దశలో నిర్మాణం అంటే సాహసమే. ఐతే కథ ఎంపికలో, మేకింగ్ లో తన అభిరుచి చూపించుకున్నాడు. దర్శకుడి దగ్గర విషయం ఉంది. ఫస్టాఫ్ లో అది కనిపిస్తుంది. సెకండాఫ్ విషయంలో ఇంకొంచెం దృష్టి పెట్టాల్సింది. కథలో కొన్ని లూప్ హోల్స్ ఉన్నాయి. ఇప్పటికీ మించిపోయిందేం లేదు. ఓ కొత్త కుర్రాడి ఎఫర్ట్ కి, తను పడిన కష్టానికీ కొన్ని మెచ్చుకోళ్లు ఇవ్వాల్సిందే. ఎక్కడా అతి... మితిమీరిన కమర్షియల్ ఎలిమెంట్స్ కీ తావు ఇవ్వకుండా, క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వడానికి చిత్రబృందం తన వంతు ప్రయత్నం చేసింది. కొత్త కుర్రాడికి ఈ సినిమాతో ఓ విజిటింగ్ కార్డు, టాలీవుడ్ లోకి ఎంట్రీ పాసు దొరికేసినట్టే.

ప్రముఖ సినీనటుడు గిరిబాబు (80) కన్నుమూత

- తెలుగు సినీ పరిశ్రమలో విషాదం



తెలుగు చిత్ర

పరిశ్రమలో విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన ప్రముఖ సినీనటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించిన గిరిబాబు.. 1973లో 'జగమే మాయ' చిత్రంతో విలన్‌గా తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో 600కు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా తెలుగు చిత్ర పరిశ్రమకు సేవలందించారు. తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న గిరిబాబు మరణం సినీ రంగానికి తీరని లోటుగా నిలవనుంది.

ఆకాశంలో ఒక తార' ప్రతి ఫ్యామిలీ చూడాల్సిన సినిమా : మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్, రుహాని శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, సాంగ్ తో సినిమా పై అంచనాలు పెరిగాయి. 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ఈ ఏడాది వరుసగా విజయాలు అందుకోవడం ఎలా అనిపిస్తోంది? -'విశ్వనాథ్ అండ్ సన్స్' పెద్ద బ్లాక్‌బస్టర్ అయింది. అలాగే 'ఇరుముడి' జనరేషనల్ బ్లాక్‌బస్టర్‌గా ప్రేక్షకుల ఆదరణ అందుకుంది. ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార' సినిమాతో వస్తున్నాం. ఇది చాలా బ్యూటిఫుల్ సినిమా. ఫ్యామిలీస్ అందరూ ఈ సినిమాను ఎంతో ఇష్టపడతారు. ఇదొక బ్యూటిఫుల్ ఇన్‌స్పిరేషనల్ ఫిల్మ్. -'లక్కీ భాస్కర్' తర్వాత దుల్కర్ ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది చాలా స్పెషల్ ఫిల్మ్. కచ్చితంగా ఈ సినిమాకు చాలా నేషనల్ అవార్డ్స్ వస్తాయని నమ్ముతున్నాను. కమర్షియల్‌గానూ అద్భుతమైన విజయాన్ని అందుకుంటుంది. 'ఆకాశంలో ఒక తార' తెలుగు సినిమాలో ఒక గొప్ప సినిమాగా నిలుస్తుందని నాకు నమ్మకం ఉంది. ఈ సినిమా కోసం మ్యూజిక్ ఎలా ఉండబోతుంది? -ఇది ఎమోషనల్ ఫిల్మ్. అలాగే చాలా మోటివేషనల్‌గా ఉంటుంది. ఈ సినిమాకు ఒక స్పెషల్ మ్యూజికల్ టచ్ కావాలని ప్రత్యేకంగా మ్యూజిక్ చేశాం. ఈ సినిమా మ్యూజిక్ చాలా ఐకానిక్‌గా ఉండబోతోంది. -హాలీవుడ్‌లో చాలా ఇన్‌స్పిరేషనల్ సినిమాలు వచ్చాయి. అలాంటి సినిమా చూస్తున్నప్పుడు మ్యూజిక్ పరంగా ఎలాంటి భావోద్వేగం కలుగుతుందో, మన ఇండియన్ మ్యూజిక్‌లోనే అలాంటి ఫీల్ తీసుకొచ్చేలా ఈ సినిమా కోసం మ్యూజిక్ చేశాను. ఇందులో కొన్ని స్పెషల్ సింథసైజర్స్‌ను ఉపయోగించాం. ఈ సినిమా కోసం చాలా డిఫరెంట్ సౌండ్‌ను క్రియేట్ చేశాం. దీనికి ఒక స్పెషల్ సౌండ్ జోన్ ఉంది. అది ఈ కథకు, సినిమాకు చాలా యూనిక్‌గా ఉండబోతోంది. సాంగ్స్‌కు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు ఎంత ప్రాధాన్యత ఉంది? -ఈ సినిమాలో పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ రెండూ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి . ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పాటకు చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది ఇందులో శ్రుతి హాసన్‌తో ఒక పాట పాడించాం. అది త్వరలోనే రిలీజ్ కాబోతోంది. తను అద్భుతంగా పాడారు. మ్యూజిక్, నటన.. ఈ రెండింటినీ ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు? -నేను రెండు నెలల ముందే మొత్తం ప్లాన్ చేసుకుంటాను. నెలలో 15 రోజులు మ్యూజిక్‌కు, మరో 15 రోజులు నటనకు కేటాయిస్తాను. నా షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండవు. ఒక సినిమాకు మ్యూజిక్ చేస్తున్నప్పుడు పూర్తిగా ఆ సినిమా మ్యూజిక్‌పైనే నా దృష్టి ఉంటుంది. రెండు నెలల ముందే ఈ ప్లానింగ్ అంతా జరిగిపోతుంది. జనవరి 12న విడుదల సినిమా రికార్డింగ్ ఇప్పటికే మొదలుపెట్టేశాను. సినిమా విషయంలో, అవుట్‌పుట్ విషయంలో నా నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అనుకున్న సమయానికి నా వర్క్ పూర్తిచేసి ఇచ్చేస్తాను. -'ఆకాశంలో ఒక తార' రికార్డింగ్ ఇప్పటికే పూర్తయిపోయింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. సినిమా మ్యూజిక్ చాలా క్వాలిటీతో ఉంటుంది. 'ఆకాశంలో ఒక తార' ఒక మోడరన్ క్లాసిక్ సినిమా. ప్రేక్షకులకు గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఈ మధ్య మీరు ఎక్కువగా తెలుగు సినిమాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టుగా ఉంది? ప్రత్యేకంగా అలా ఏమీ లేదు. నేను చేస్తున్న తెలుగు సినిమాలన్నీ చాలా పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. 'లక్కీ భాస్కర్', 'ఇరుముడి', 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఇలా వరుస విజయాలు రావడంతో ఆటోమేటిక్‌గా అవకాశాలు కూడా పెరుగుతాయి. -తెలుగు పరిశ్రమ ఇప్పుడు అద్భుతంగా ఉంది. ఇక్కడి దర్శకులు చాలా కొత్త జానర్స్‌ను ప్రయత్నిస్తున్నారు. ఇది సినిమాకు, పరిశ్రమకు రెండింటికీ చాలా మంచిది. దాని ద్వారా చాలా కొత్త మ్యూజిక్ వస్తోంది. మీకు ఏమైనా డ్రీమ్ ప్రాజెక్ట్స్ ఉన్నాయా? 'ఇరుముడి' లాంటి సినిమా చేయడం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. అలాగే ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార' కూడా చాలా మంచి సంతృప్తిని ఇచ్చింది. నాకు మంచి కథ వస్తే చాలు. 'ఆకాశంలో ఒక తార' ఎలా ఉండబోతోంది? -సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా ఇది. ప్రతి మహిళ ఇష్టపడే సినిమా అవుతుంది. నిర్మాతల గురించి? ఈ మ్యూజిక్ జర్నీలో స్వప్న గారు ఎంతో సపోర్ట్ చేశారు. ఇది చాలా బ్యూటిఫుల్ సినిమా. ప్రతి ఒక్కరూ సెలబ్రేట్ చేసుకునేలా ఉంటుంది. ఇదొక మోడర్న్ డే క్లాసిక్ అవుతుంది. నటుడిగా చేయబోతున్న సినిమాలు? ఫిబ్రవరిలో ఒక సినిమా రిలీజ్ కాబోతోంది. అలాగే సెల్వ రాఘవన్ గారి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాను. ప్రస్తుతం మ్యూజిక్ చేస్తున్న సినిమాలు? సిద్దు జొన్నలగడ్డ గారి సినిమాకు మ్యూజిక్ చేస్తున్నాను. అలాగే అనిల్ రావిపూడి గారి 'జనవరి 12' సినిమాకు, దుల్కర్ గారి 'శ్రీశ్రీ' సినిమాకు కూడా మ్యూజిక్ చేస్తున్నాను.

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com